ఈనాడు ఖమ్మం

బుధవారం 16 ఆగస్టు 2017 16 పేజీలు



ఖమ్మం పరేడ్ మైదానంలో జెండా ఎగురవేసి వందనం చేస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. పక్కన కలెక్టర్ లోకేశ్‌కుమార్, సీపీ తఫ్సీర్ ఇక్బాల్



ఆకట్టుకున్న విద్యార్థుల నృత్యాలు

- రాష్ట్రంలో జిల్లా అగ్రస్థానమే ఆకాంక్ష
- స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి తుమ్మల

ప్రజలందరికీ పథకాలు..
నా అదృష్టం

ఈనాడు, ఖమ్మం

ప్రభుత్వ పథకాలను ప్రజలందరి ముందుంచడం తన అదృష్టంగా భావిస్తున్నట్టు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. స్వాంతంత్ర్య వేడుకలను పురస్కరించుకుని మంగళవారం ఖమ్మం జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ మైదానంలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన అనంతరం మంత్రి తుమ్మల జిల్లా ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అభివృద్ధి, సంక్షేమ రంగంలో రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా అగ్రగామిగా ఉండటం సంతోషకర పరిణామమన్నారు. ఇటీవల అనారోగ్యం బారినపడిన మంత్రి ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రసంగ పాఠం పూర్తిచేశారు. ప్రసంగ వివరాలు మంత్రి మాటల్లోనే..

హరితహారం: హరిత రాష్ట్రంగా తెలంగాణను చూడాలని ముఖ్యమంత్రి ఆశయం, సీఎం సూచన మేరకు ఇప్పటి వరకు 5.46 కోట్ల మొక్కలను నాటడమే కాకుండా పరిరక్షణకు చర్యలు చేపట్టినందుకు ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నా. రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా అగ్రగామిగా నిలుస్తుందని

మిగతా 2వ పేజీలో



"**మిషన్ కాకతీయ:** రూ.173 కోట్లతో 697 చెరువులను పునరుద్ధరించాం. ప్రస్తుతం జిల్లాలోని చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి."

విద్య ఈ విద్యా సంవత్సరంలో 154 ప్రాథమిక పాఠశాలలో కొత్తగా ఆంగ్ల మాధ్యమం ద్వారా బోధన జరుగుతోంది. అన్ని పాఠశాలల్లో, కళాశాలల్లో మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాం.

"జిల్లాలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం, నూతన పరిశ్రమల స్థాపనలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఖమ్మంలో ఐటీ హబ్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసుకోవడం సంతోషదాయకం."





కనుల పండువగా కృష్ణాష్టమి వేడుకలు

ఖమ్మంలో దాండియా నృత్యం చేస్తున్న యువతి

వివరాలు 11లో

పెళ్లి బాజా..
గిరాకీ బాగా!

నేడు, రేపు వందల సంఖ్యలో వివాహాలు

పూలు, మండపాలు, అలంకరణలకు రెట్టింపైన ధరలు

సత్తుపల్లి, న్యూస్‌టుడే

పెళ్లి బాజాకు భారీగా గిరాకీ పెరిగింది. దీంతో ఈ రెండు రోజుల్లో పెళ్లిళ్లు చేసుకునే వారికి ఖర్చు అధికమవుతోంది. శ్రావణమాసంలో ఈ నెల 18 వరకే మంచి ముహూర్తాలు కావటంతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల పరిధిలో బుధ, గురువారాల్లో వందల సంఖ్యలో పెళ్లి భాజాలు మోగనున్నాయి. దీంతో కల్యాణ మండపాలు, సెట్టింగ్‌లు, అలంకరణ పూలు, వంటమేస్త్రీలు, పురోహితులకు భారీగా డిమాండ్ పెరిగింది. గత శనివారం నుంచి వరుస సెలవులు రావటంతో ఎక్కువ సంఖ్యలో ఈ రెండు రోజుల వ్యవధిలో ముహూర్తాలను పెట్టుకున్నారు. దీంతో కల్యాణ మండపాలు

మిగతా 2వ పేజీలో



సత్తుపల్లిలో ముస్తాబైన కల్యాణ మండపం

పెళ్లి బాజా.. గిరాకీ బాగా!

(మొదటిపేజీ తరువాయి) కళకళలాడుతున్నాయి. ఈ నెల 22 నుంచి భాద్రపద మాసం. ఈ మాసంలో ముహూర్తాలు పెద్దగా లేవు. దీంతో వచ్చే నెల 20 వరకు పెద్దగా పెళ్లిళ్లుండవని పురోహితులు చెబుతున్నారు.

ఆర్టీసీకీ దండిగా ఆదాయం..

వరుస సెలవులకు తోడు వివాహాల నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ఆర్టీసీ బస్సులను అద్దెకు తీసుకోవటంతో ఆ సంస్థకు గణనీయంగా ఆదాయం పెరిగింది. సత్తుపల్లి ఆర్టీసీ డిపోలో గత నాలుగు రోజుల వ్యవధిలో వివాహాలకు అద్దెకు ఇచ్చిన బస్సులు సంఖ్య 33. అలాగే రెండు జిల్లాల పరిధిలో వివాహాలకు అద్దెకు తీసుకున్న బస్సుల సంఖ్య 150కి పైగానే ఉంది. దీనికితోడు ప్రైవేటు కార్లు, ఇతర వాహనాలకూ భారీగా గిరాకీ పెరిగింది.

పూలు మరింత ప్రియం..

వివాహాది శుభాకార్యాల్లో పూలు ప్రధానం.. పెళ్లి పందిళ్లు, ఇళ్లు, వాహనాల అలంకరణకు ఇవి తప్పనిసరి. ప్రస్తుత ముహూర్తాల నేపథ్యంలో వీటి ధర భారీగా పెరిగింది. లీల్లీ, కనకాంబరాలు, గులాబీలు, మల్లెలు తదితర పూల ధర రెట్టింపయింది. అలంకరణకు వాడే ఆర్కే పూల ధర కిలో రూ.300 నుంచి రూ. 600కు, బంతి రూ.20 నుంచి రూ.100, జరబరకు రూ.30 నుంచి రూ. 150 ధర పెరిగింది.

మండపాలకు గిరాకీ

రెండు జిల్లాల్లో సుమారు 100కి పైగా కల్యాణ మండపాలున్నాయి. సత్తుపల్లిలో 8, ఖమ్మంలో 40, కొత్తగూడెంలో 10 వరకు మండపాలున్నాయి. ఇవిగాక మధిర, భద్రాచలం, ఇల్లందు, వైరా, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, అశ్వారావుపేట తదితర చోట్ల మండపాలున్నాయి.

★ ఇళ్ల వద్ద స్థలం, ఇతర వసతులు లేకపోవటానికి తోడు వర్షాకాలం కావటంతో గ్రామీణ ప్రాంత వాసులు సైతం కల్యాణ మండపాలనే ఆశ్రయిస్తున్నారు. మండల, పట్టణ కేంద్రాల్లోని మండపాల్లో వివాహాలు నిర్వహించేందుకు మొగ్గుచూపుతున్నారు. దీంతో మండపాలకు గిరాకీ పెరిగింది. ముహూర్తాన్ని ఖరారు చేసుకున్న వెంటనే కల్యాణ మండపాలపై గ్రామీణ వాసులూ దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాల్లో మండపాల రేట్లు రూ. 50 వేలు మొదలుకొని రూ.4 లక్షల వరకు ఉన్నాయి.

ప్రజలందరికీ పథకాలు.. నా అదృష్టం

(మొదటిపేజీ తరువాయి) ఆశిస్తున్నా.

★ **వ్యవసాయం:** రైతులను ఆదుకునేందుకు వచ్చే ఏడాది నుంచి ఎకరానికి రూ.నాలుగు వేలు ప్రభుత్వం సాయం అందజేస్తుంది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో నూతన శాస్త్రీయ విధానాలపై రైతులకు "ఆత్మ" ఆధ్వర్యంలో శిక్షణ, సదస్సులు నిర్వహిస్తున్నాం. జిల్లాలో ఇప్పటివరకు రూ.1652.42 కోట్లు రుణమాఫీ చేయడమే కాకుండా పంట రుణాల నిర్దేశిత లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించాలని బ్యాంకర్లను కోరుతున్నాను. ఉత్పత్తులను జిల్లాలోని ఏడు వ్యవసాయ మార్కెట్ల ద్వారా కొనుగోలు చేస్తూ గిట్టుబాటు ధర కల్పిస్తున్నాం. ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తున్నాం.

★ **సాదాబైనామా:** రాష్ట్రంలోనే సాదాబైనామా పట్టాల ప్రక్రియలో జిల్లాలో ఇప్పటివరకు 96 వేల మంది రైతులకు అనుభవదారుని పేరనే పట్టాలను అందించిన ఘనత మన జిల్లాకే దక్కింది.

★ **విద్యుత్తు:** రాష్ట్రం ఆవిర్భావం నుంచి పట్టణ ప్రాంతాలతో సమానంగా గ్రామీణ ప్రాంతాలకు 24 గంటల నిరంతర విద్యుత్తును అందిస్తున్నాం. రబీ నుంచి రైతులకు 24 గంటల వ్యవసాయ ఉచిత విద్యుత్తును అందిస్తామని తెలియజేయడానికి ఎంతో గర్వపడుతున్నాం. జిల్లాలో రూ.200 కోట్లతో రెండు 400 కేవీ సబ్ స్టేషన్లు, రూ.150 కోట్లతో మూడు 220 కేవీ సబ్‌స్టేషన్లు, రూ.60 కోట్లతో మూడు 120 కేవీ సబ్ స్టేషన్లు నిర్మాణంలో ఉన్నాయి. రూ.100 కోట్లతో 42 విద్యుత్తు ఉపకేంద్రాలను మంజూరు చేసిన వాటిలో 34 ఉపకేంద్రాలు పూర్తి చేయడం సంతోషకరం.

★ **భద్రాద్రిపవర్ ప్లాంట్:** విద్యుత్తు లోటుతో ఉన్న రాష్ట్రం నుంచి చీకటి తొలగించే బృహత్తర కార్యక్రమం ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచే ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. సీఎం చేతుల మీదుగా రూ. 7,290 కోట్లతో 1080 మెగావాట్లను అందించే భద్రాద్రి పవర్ ప్లాంట్ తెలంగాణకు వెలుగునివ్వనుండటం మనకు గర్వకారణం.

★ **సీతారామ ఎత్తిపోతల పథకం:** దుమ్ముగూడెం వద్ద సుమారు రూ.8 వేల కోట్లతో సీతారామ ఎత్తిపోతల పథకం ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించుకున్నాం. పనులు ప్రారంభించుకున్నాం. ఇటు ఖమ్మం జిల్లా అటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కల త్వరలోనే నెరవేరబోతోంది. ఇది పూర్తయితే 10 లక్షల ఎకరాలకు సాగు నీరివ్వటంతో పాటు గోదావరి జలాలను పాలేరు, వైరా జలాశయాలకు అనుసంధానం చేసి ఖమ్మం జిల్లాను కరవు రక్కసి నుంచి విముక్తి కల్పించవచ్చు.

★ **భక్తరామదాసు ఎత్తిపోతలు:** భక్తరామదాసు ఎత్తిపోతల పథకం నిర్దేశించిన సమయానికి ముందే పదకొండు నెలల కాలంలోనే పూర్తి చేసి ముఖ్యమంత్రిచే ప్రారంభించి 70 వేల ఎకరాలకు సాగు నీరు అందించడం ఆనందకరం. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోలేని పాలేరు పాత కాలువకు పునరుజ్జీవం పోసి ట్రయల్ రన్ పూర్తి చేసుకొని ప్రారంభానికి సిద్ధం చేసినందుకు గర్విస్తున్నాను. సాగర్ కాలువల ఆధునికీకరణ పనులు తుది దశకు చేరుకున్నాయి.

★ **ఆర్‌అండ్‌బీ:** రహదారులు, భవనాల శాఖ ద్వారా జిల్లాకు అధిక ప్రాధాన్యం కల్పించాం. ప్రతి గ్రామం నుంచి మండల కేంద్రానికి పక్కా రోడ్లు, మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రానికి రెండు వరసల రోడ్లు, జిల్లా కేంద్రం నుంచి రాజధానికి నాలుగు వరుసల రోడ్లు ఉండేలా మొత్తం 1713 కి.మీ. రహదారులు విస్తరణ పనులు చేపట్టాం. విస్తరణ, వంతెనల నిర్మాణానికి రూ.1,601 కోట్ల నిధులు కేటాయించాం. ప్రతి నియోజకవర్గానికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాలు ఏర్పాటు చేస్తున్నాం. ఖమ్మం జిల్లాలో సూర్యాపేట నుంచి ఖమ్మం వరకు 60 కి.మీ., కోదాడ నుంచి ఖమ్మం వరకు 40 కి.మీ, ఖమ్మం నుంచి అశ్వారావుపేట వరకు 122 కి.మీటర్ల రోడ్లను ఎన్‌హెచ్‌లుగా మార్చాం. ఈ రహదారులకు రూ.1,700 కోట్ల విడుదలతో పనుల ప్రారంభానికి ఆదేశాలు జారీ చేయడమైంది.



సమరయోధులను సన్మానిస్తున్న మంత్రి తుమ్మల

★ **రైల్వేలైన్:** కొత్తగూడెం నుంచి సత్తుపల్లి వరకు రూ.704 కోట్లతో 53 కి.మీటర్ల రైల్వేలైను మంజూరు కాగా సర్వే పనులు జరుగుతున్నాయి. త్వరలో ముఖ్యమంత్రి పనులకు శంకుస్థాపన చేస్తారు.

★ **వైద్యం:** మెరుగైన వైద్యం అందించడానికి జిల్లా ఆసుపత్రిని నిమ్స్ తరహాలో అభివృద్ధి పరిచేందుకు నిర్ణయించాం. ఆ పనులు పురోగతిలో ఉన్నాయి. మాతా, శిశు ఆరోగ్య సంరక్షణకు రూ.20 కోట్ల నిధులతో నిర్మించిన 150 పడకల నూతన కేంద్రాన్ని ఇటీవలే ప్రారంభించుకున్నాం. కేసీఆర్ కిట్ పథకంలో భాగంగా ఇప్పటి వరకు 1,406 మంది మాతృమూర్తులకు లబ్ధి చేకూర్చాం.

★ **మిషన్ భగీరథ:** ఇంటింటికి సురక్షిత తాగునీటిని నల్లా ద్వారా అందించేందుకు రూ.1,831 కోట్లతో చేపట్టిన పనులు జిల్లాలో శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే ఉగాది నుంచి సురక్షిత తాగునీరు ప్రతి ఇంటికి అందిస్తాం.

★ **పంచాయతీరాజ్:** పంచాయతీరాజ్ శాఖ ద్వారా వివిధ పథకాల కింద రూ.118 కోట్లతో 456 పనులు పూర్తి చేసుకున్నాం. 57 గ్రామ పంచాయతీలలో 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయ్యింది. పలు పంచాయతీలను గుడుంబా రహిత, నగదు రహిత పంచాయతీలుగా ప్రకటించుకోవడం ఆనందదాయకం.

★ **హౌసింగ్:** ఎర్రవెల్లి తర్వాత జిల్లాలోనే రెండు పడక గదుల ఇళ్లను ప్రారంభించి లబ్ధిదారులకు అందజేశాం. ఈ పథకం కింద జిల్లాకు 8,600 గృహాలు మంజూరు కాగా 2,670 గృహాల పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి.

★ **సంక్షేమం:** ఎస్సీ విద్యార్థులకు మెస్‌ఛార్జీలు పెంచడమేకాక ఉపకార వేతనాలు, ఫీజు రీఎంబర్స్‌మెంటు, గుడుంబా బాధితులకు పునరావాసం, భూమిలేని నిరుపేద దళిత వ్యవసాయ ఆధారిత కుటుంబాల భూమి కొనుగోలు పథకంలో మహిళల పేరునే భూ పంపిణీ చేయడం. మైనారిటీల సంక్షేమంలో భాగంగా 7 గురుకుల విద్యాలయాలను ప్రారంభించుకున్నాం. గిరిజన సంక్షేమంలో భాగంగా 7,366 మంది గిరిజనులకు రూ.4.14 కోట్లతో వివిధ పథకాల కింద లబ్ధి చేకూర్చాం.

★ మహిళా, శిశు అభివృద్ధి: మహిళాభివృద్ధి, శిశు, వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ద్వారా బాలబాలికలకు పౌష్టికాహారం అందించడమే కాక గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యలక్ష్మీ పథకాన్ని అందిస్తున్నాం.

★ **షాదీముబారక్/కల్యాణలక్ష్మీ:** పేదింటి ఆడపిల్ల తల్లిదండ్రులకు ఆర్థిక సాయం కింద రూ.75,116 అందిస్తూ వారి సంతోషంలో పాలుపంచుకుంటున్నాం. ఈ పథకం కింద ఇప్పటివరకు 3,309 మందికి రూ.17.15 కోట్లతో లబ్ధి సమకూరింది.

★ **పింఛన్లు:** ఒంటరి మహిళలకు చేయూత, నిరుపేద మహిళలకు డీఆర్‌డీఏ ద్వారా ప్రోత్సాహం, స్త్రీ నిధి రుణాల మంజూరు చేశాం.

★ **గొర్రెల అభివృద్ధి ప్రత్యేక పథకం:** గొర్రెల సంపద అభివృద్ధి ద్వారా యాదవులందరు ఆర్థికంగా ఎదగాలని జిల్లాకు రూ.23 కోట్లను విడుదల చేశాం. పంపిణీ చేసిన గొర్రెల సంరక్షణకు చర్యలు, వాటికి బీమా సౌకర్యం కల్పించాం. ప్రతి నియోజకవర్గానికి ఒక సంచార పశు వైద్యశాలను ప్రవేశపెట్టాం.

★ **ఉపాధి హామీ పథకం:** జాతీయ ఉపాధి హామీ కింద పనిదినాలు కల్పించడం జన్-ధన్ అకౌంట్స్ ద్వారా వేతనాలు చెల్లించడం ప్రధానమంత్రి సురక్ష యోజన కింద 52,396 కుటుంబాలకు బీమా చేయించాం.

★ **మత్స్య శాఖ:** మత్స్యకారుల సర్వతోముఖాభివృద్ధికి వివిధ రకాల పథకాల కింద 3,722 యూనిట్లు మంజూరు చేశాం. 190 చెరువులలో మత్స్య సంపదను గణనీయంగా ఉత్పత్తి చేయడానికి తగిన చర్యలు చేపట్టాం. మత్స్యకారుల అభివృద్ధి, సంక్షేమానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

★ **పౌరసరఫరాలు:** పౌరసరఫరాల శాఖ ద్వారా సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలకు సన్నబియ్యం కేటాయించాం.

★ **నగరపాలక సంస్థ:** నగరపాలక సంస్థతోపాటు నగర పంచాయతీల్లోని నిరుపేదల అభ్యున్నతికి మెప్మా ద్వారా వివిధ సంక్షేమ పథకాలకు మా ప్రభుత్వం పటిష్ట చర్యలు చేపట్టింది. రోడ్ల విస్తరణ, సెంట్రల్ లైటింగ్, డివైడర్లతోపాటు ఖమ్మం నడిబొడ్డున లకారం చెరువును సుందరీకరణ చేశాం. గోళ్లపాడు ఛానల్ నిర్మాణం, షాదీఖానాల నిర్మాణం, ఆధునికీకరణ, నూతన ఆర్‌టీసీ బస్సు స్టేషన్‌ను నిర్మిస్తున్నాం. శ్మశాన వాటికలు కల్పించి సుందరనగరంగా ఖమ్మం నగర రూపురేఖలను మార్చామనడానికి ఎంతో సంతోషిస్తున్నా. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి. జిల్లా సమగ్రాభివృద్ధికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులకు, అధికారులకు ధన్యవాదాలు.

అదే స్ఫూర్తితో.. రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల అనారోగ్యం బారినపడిన విషయం విదితమే. ప్రస్తుతం కోలుకున్న మంత్రి తుమ్మల ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో ఖమ్మం చేరుకొని స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో మంగళవారం జాతీయ పతాకావిష్కరణ చేశారు. అనంతరం జిల్లా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఎక్కడ కూడా ఇబ్బందిపడకుండా ప్రసంగ పాఠం పూర్తి చేశారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన తర్వాత జిల్లాలో పాల్గొంటున్న మొదటి కార్యక్రమం నేపథ్యంలో ఉన్నతాధికారులు తగిన జాగ్రత్తలు తీసుకున్నారు. పరేడ్‌ను వీక్షించిన అనంతరం మంత్రి తుమ్మల అన్ని గ్యాలరీలలో తిరుగుతూ ప్రతి ఒక్కరిని పలకరించారు. అనంతరం ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అయ్యారు.

తెరపై ఈనాడు

నర్తకి, శ్రీసుందర్: లై విదోద: ఫిదా
శ్రీతిరుమల: జయ జానకి నాయక
ఆదిత్య, శ్రీనివాస: నేనే రాజు నేనే మంత్రి
కిన్నెరసాని: గౌతమ్‌నంద

స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలి: పువ్వాడ

ఖమ్మం అర్బన్, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య ఫలాలు అన్ని వర్గాల ప్రజలకు అందే విధంగా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే పువ్వాడ నాగేశ్వరరావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నగరంలోని మమత ఆసుపత్రి ఎదుట ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పువ్వాడ జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి జానిమియా, నాయకులు ఏనుగు గాంధీ, వెంకట్, అక్రం, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



జెండా ఎగురవేస్తున్న పువ్వాడ నాగేశ్వరరావు

ఎన్నో పోరాటాల ఫలమే స్వాతంత్ర్యం: ఎమ్మెల్యే

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: ఎన్నో పోరాటాలతో సాధించుకున్న స్వాతంత్ర్య ఫలాలు దేశ ప్రజలందరికీ అందాలని ఖమ్మం శాసనసభ్యుడు పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. రఘునాథపాలెం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం స్వాతంత్ర్య వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ మాళోతు శాంతతో కలిసి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అందరితో కలిసి నవభారత ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు అజ్మీరా ఈరూనాయక్, ఎంపీడీవో ఏలూరి శ్రీనివాసరావు, ఈవోఆర్డీ రాజేశ్వరి, సూపరింటెండెంట్ జానిమియా, పీఆర్ ఏఈ ఆదిత్యరాజ్, ఏపీవో అమ్మాజాన్, ఎంసీవో వెంకటేశ్వర్లు, ఏపీఎం శారద, మండల ఉపాధ్యక్షురాలు యరగర్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

★ తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు డి.తిరుమలాచారి జాతీయ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీటీ వపన్‌కుమార్, సురేష్‌కుమార్, ఆర్ఐలు క్రాంతికుమార్, నరసింహారావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

శోధన.. ఛేదన

అక్రమార్జనే ధ్యేయంగా ప్రజారోగ్యంతో ఆటలాడుకుంటున్న ముఠా గుండెల్లో ఇప్పుడు రైళ్లు పరుగెత్తుతున్నాయి. ఇన్నాళ్లూ జనావాసాల మధ్యనే కొనసాగిస్తున్న కల్తీ లీలలు గుట్టు రట్టు అవుతుండటంతో విస్తుపోవడం జనం వంతవుతోంది. ఆహార పదార్థాల నుంచి అసాంఘిక కార్యకలాపాల వరకు అవినీతి ఏదైనా సమాచారం అందిస్తే చాలు ఇట్టే వాలిపోతున్నారు. అక్కడికక్కడే అక్రమార్కుల భరతం పడుతున్నారు.

ఇదీ జిల్లాలో పోలీసు టాస్క్‌ఫోర్స్ టీమ్ ఘనత. మూడు నెలల్లోనే 52 సంఘటనలు ఛేదించి రాష్ట్రంలోనే ప్రత్యేకతను చాటింది..

మూడు నెలల్లో 52 సంఘటనల ఛేదన

- కల్తీల గుండెల్లో టాస్క్‘ఫోర్స్’
- అసాంఘిక శక్తుల కదలికలపై నిఘా
- సమాచారం అందిస్తే చాలు
- అక్రమార్కులపై ఉక్కుపాదం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే

తినే బియ్యం కల్తీ.. అన్నంలో వడ్డించుకునే పప్పు కల్తీ.. తాగే పాలు కల్తీ.. నీళ్లు కల్తీ.. చివరికి చిన్నారులు తినే తినుబండారాలూ కల్తీయే. పెచ్చరిల్లుతున్న నేర సామ్రాజ్యంలో కల్తీ పదార్థాల బెడద అంతకంతకు పెరిగిపోతోంది. రెస్టారెంట్‌కి వెళ్లి మటన్ బిర్యానీ ఆర్డర్ చేస్తే అది మేక మాంసమేనా అనే సంశయం. పోనీ ఇంట్లో బిర్యానీ వండుకుని తిందామని మసాలా దినుసులు, అల్లం పేస్ట్ కొంటే అందులోనూ కల్తీ. నోటి దగ్గర పెట్టుకునే ప్రతీ పదార్థాన్నీ ఆచితూచి తినాల్సిన రోజులు దాపురించిందంటే అతిశయోక్తి కానేకాదు. కాసులకు కక్కుర్తి పడి ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్న కల్తీ రాయుళ్ల భరతం పట్టడంలో ఇటీవల టాస్క్ ఫోర్స్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. మునుపెన్నడూ లేనివిధంగా చిన్నపాటి ఉప్పందినా టాస్క్‌ఫోర్స్ బృందాలు రంగ ప్రవేశం చేసి కల్తీ రాయుళ్ల భరతం పడుతున్నారు. కల్తీల గుట్టు రట్టు చేస్తున్నారు.



నాణ్యత లేని బ్లీచింగ్ తయారీ కేంద్రంలో అధికారుల దాడులు

సమాచారం అందించిన వారి వివరాలు గోప్యం

మన ఇంటికి ఎవరైనా వచ్చి మోసానికి పాల్పడితే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. పోలీసులు కేసు నమోదు చేసి జరిగిన ఘటనపై విచారణ చేపట్టడం ద్వారా బాధితులకు న్యాయం జరిగేలా చూస్తారు. అదే ముఠాగా ఏర్పడిన కొందరు వ్యక్తులు వ్యవస్థపై దుష్ప్రభావం చూపే పనికి తెగబడినా ఎవరూ పట్టించుకోరు. ఇలాంటి ఉదంతాలు కళ్లెదుట కనిపిస్తున్నా ఫిర్యాదు చేసే సాహసం చేయరు. ఇలాంటి ముఠాల పని పట్టేందుకే జిల్లాలో టాస్క్ ఫోర్ విభాగం ఏర్పాటైంది. ఈ విభాగానికి ఫిర్యాదుతో పనే లేదు. సమాచారం ఉంటే చాలు. . క్షణాల్లో వాలిపోతారు. అసాంఘిక శక్తుల ఆటకట్టిస్తారు. ఇదే టాస్క్ ఫోర్స్ ప్రత్యేకత. అయితే ఇలాంటి ముఠాలపై సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు. అవసరమైతే రక్షణ కల్పిస్తారు.


టాస్క్‌ఫోర్సు పురుడుపోసుకుందిలా..

జిల్లా పోలీసు కమిషనరేట్ హోదా కల్పించిన నేపథ్యంలో ఖమ్మం జిల్లాకు పోలీసు బాస్‌గా కమిషనర్ వ్యవహరిస్తున్నారు. ఆయన పర్యవేక్షణలోనే మే 15వ తేదీన ప్రత్యేక పోలీసు బృందం(టాస్క్‌ఫోర్సు) పురుడుపోసుకుంది. గతంలో నగరాలకే పరిమితమైన ఈవిభాగాన్ని పోలీసు కమిషనర్ ఇక్కడా ప్రవేశపెట్టారు. తొలుత ఒక ఎస్సై 9మంది కానిస్టేబుళ్లతో బృందాన్ని ఏర్పాటు చేశారు. క్రమేణా ఇద్దరు సీఐలకు బాధ్యతలు అప్పగించారు. అప్పటి నుంచి నిరాటంకంగా ఈ బృందం తమ కార్యకలాపాలను కొనసాగిస్తూ అక్రమార్కుల గుండెల్లో గుబులు పుట్టిస్తుంది. ఉన్నతాధికారులకు అందే ఫిర్యాదులతో పాటు సమాజంలో జరుగుతున్న అసాంఘిక, అనైతిక కార్యక్రమాలపై ఈ బృందం నిఘా ఉంచుతుంది. పక్కా సమాచారాన్ని సేకరించి అక్రమాలను బయటపెట్టేందుకు చర్యలు చేపడతారు. సంఘటన వెలుగుచూసిన ప్రాంతానికి చెందిన పోలీసు స్టేషన్‌లో నిందితులపై కేసులు నమోదు చేస్తారు.



ఎఫ్‌సీఐ గోడౌన్ వద్ద పట్టుబడిన కల్తీ కల్లు





ఇటీవల గుట్టురట్టయిన అక్రమాలెన్నో..

- ఐపీఎల్ బెట్టింగ్.. జిల్లాలో గుట్టుచప్పుడు కాకుండా ఎలా విస్తరించిందో తెలిసిందే. జిల్లా నుంచి రెండు తెలుగు రాష్ట్రాలకు విస్తరించి చాప కింద నీరులా బెట్టింగ్ రాయుళ్లు సులువుగా సంపాదించడానికి ఎత్తులు వేశారు. కనీసం రెణ్నెళ్ల పాటు సాగిన ఈ బెట్టింగ్ బాగోతాన్ని టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎంతో చాకచక్యంగా ఛేదించారు. ఎర్రుపాలెంలోలో బెట్టింగ్ బాబును పట్టుకుని తీగ లాగడం ద్వారా 20 మందికి పైగా రెండు రాషాల్లో బెట్టింగ్ రాయుళ్ల బాగోతం బట్టబయలైంది. తొలుత ఎర్రుపాలెంలో ఓ కీలక వ్యక్తికి ఫోన్ చేసి బెట్టింగ్‌పై చర్చించడం ద్వారా బాగోతం గుట్టురట్టు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరులో, పెనుగంచిప్రోలు ప్రాంతాల్లో విస్తరించిన బెట్టింగ్ రాయుళ్ల ఆచూకీని కూడా కనుగొనగలిగారు.
- ఇక చిన్నారులు ఎంతో ఇష్టంగా తినే కుర్‌కురే ప్యాకెట్లు, ఇతర తినుబండారాలను కల్తీ చేసి కొత్త ప్యాకింగ్ చేస్తున్న ఓ ముఠాను టాస్క్‌ఫోర్స్ బృందం పట్టుకుంది. ఖమ్మం నగర శివారులో నిత్యం జనం తిరుగాడే ప్రాంతంలోనే ఈ కుటీరం నడుస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అకస్మాత్తుగా దాడి చేసి నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు.
- జిల్లా కేంద్రం నడిబొడ్డున కల్లును కల్తీ చేసి సరఫరా చేస్తున్నట్లు గుర్తించిన టాస్క్‌ఫోర్స్ బృంద సభ్యులు నిఘా వేసి కల్తీ కల్లు కేంద్రంపై దాడి చేశారు.
- ఇటీవల రెవెన్యూ శాఖ, ఇతర వ్యాపార ప్రముఖులు ఎంతో కీలకమైన వ్యక్తులు పేకాటలో ఆడుతుండగా పట్టుకుని ఒత్తిళ్లకు తాము అతీతులమని నిరూపించారు. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న ఖమ్మం గ్రామీణ మండలంలోనూ ఓ పేకాట ముఠాను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు.
- ఇటీవల ఖమ్మం త్రీ టౌన్ ప్రాంతంలో ఇళ్ల మధ్యనే గుట్టుచప్పుడు కాకుండా తయారు చేస్తున్న కల్తీ అల్లం, బ్లీచింగ్‌పౌడర్ బండారాన్ని బట్టబయలుచేశారు.
- కూసుమంచిలో వాహనాల్లో పెద్ద ఎత్తున తరలిస్తున్న గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు.
- తిరుమలాయపాలెం మండల కేంద్రం సమీపంలో గంజాయిని పట్టుకున్నారు. వైరాలో అక్రమంగా తరలిపోతున్న 5 లారీల ఇసుకను పట్టుకుని సంచలనం రేపారు.
- అలాగే జిల్లా రెవెన్యూ యంత్రాంగాన్ని ఓ కుదుపు కుదిపిన నకిలీ పాస్ పుస్తకాల కుంభకోణాన్ని ఛేదించడంలోనూ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కీలక భూమిక పోషించారు. ఇవన్నీ సివిల్ పోలీసులు, ఇతర అధికార యంత్రాంగానికి తెలియవా అంటే ఆశ్యర్యం కలగకమానదు. ఈ సంఘటనలను అంతగా పట్టించుకోని యంత్రాంగాన్ని సైతం నివ్వెరపరిచేలా ప్రత్యేక పోలీసు బృందం తన పనితీరును ప్రదర్శిస్తుందనే అంశం జిల్లాలో ఇపుడు చర్చనీయాంశమైంది.

అక్రమాలను సహించేదిలేదు సీపీ తఫ్సీర్ ఇక్బాల్

సమాజంలో జరుగుతున్న అక్రమాలను, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాము. ప్రత్యేక బృందం పోలీసులు నిరంతరం నిఘా ఉంచుతూ వారి ఆటకట్టిస్తారు. ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడినా, ఆర్థిక నేరాలకు పాల్పడినా సహించేది లేదు. నిషేధిత సరకుల విక్రయాలు, జూదం, పేకాట వంటిపై ఉక్కుపాదం మోపుతాము. తాము నివాసుమంటున్న పరిసరాల్లో అనైతికంగా ఎటువంటి కార్యక్రమాలు జరిగినా వెంటనే మా దృష్టికి తీసుకురావాలి.

టాస్క్‌ఫోర్సు చరవాణి సంఖ్యలు:

97015 72975, 90106 91888

ఒకే కాన్పులో నలుగురు శిశువులు జననం

- ముగ్గురు ఆడ శిశువులు మృతి

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలంలోని మామునూరు గ్రామానికి చెందిన గంతాల భవాని(25) మంగళవారం ఒకే కాన్పులో నలుగురు శిశువులకు జన్మనిచ్చింది. కృష్ణా జిల్లా తిరువూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ఉదయం 6 గంటలకు భవానీ నలుగురు శిశువులకు జన్మనిచ్చింది. వీరిలో ముగ్గురు ఆడ శిశువులు, ఓ మగ శిశువు ఉన్నారు. జన్మించిన ముగ్గురు ఆడ శిశువులు మధ్యాహ్న సమయంలో మృతి చెందగా, మగ శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు తండ్రి రామకృష్ణ స్థానిక విలేకర్లకు తెలిపారు. రామకృష్ణ, భవానీలకు నాలుగు సంవత్సరాల కిందట వివాహం జరిగింది.



ఒకే కాన్పులో జన్మించిన నలుగురు పిల్లలు

కల్చరల్ బుక్ ఆఫ్ ఇండియా డైరెక్టర్‌గా రాజారావు

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: జిల్లాకు చెందిన తెలంగాణ సాంస్కృతిక సమాఖ్య వ్యవస్థాపకులు పి.రాజారావుకు అరుదైన అవకాశం లభించింది. సాంస్కృతిక రంగానికి ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ హ్యుమానిటీ హెల్త్ సైన్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించే కల్చర్ బుక్ ఆఫ్ ఇండియా రికార్డ్సు డైరక్టర్‌గా ఆయనను నియమించారు. 2019 ఏప్రిల్ వరకు ఆయన పదవిలో కొనసాగుతారని సంస్థ నిర్వాహకులు తెలిపారు. దేశాల మధ్య దౌత్య సంబంధాలను సంస్కృతిక సంప్రదాయాల ద్వారా ప్రచారం చేయడం ఆయన బాధ్యతగా నియామక ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

గిరిజనులను హింసించిన ఘనత కేసీఆర్‌కే దక్కింది

కొత్తగూడెం పట్టణం: ఏడు దశాబ్దాల స్వాతంత్ర్య చరిత్రలో గిరిజనులను హింసించిన ఘనత తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కిందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం(టీఏజీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు రవికుమార్ విమర్శించారు. ఆ సంఘం జిల్లా కమిటీ సమావేశం మంగళవారం స్థానిక మంచి కంటి భవన్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడిచిపోతున్నా గిరిజనులకు ఇచ్చిన ఏ ఒక్క హామీ నెరవేర్చలేదన్నారు. అటవీ హక్కుల గుర్తింపు చట్టాన్ని నీరుగార్చుతూ గిరిజనులకు రావాల్సిన ఫలాలను రాకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటి వరకు ఒక్క పట్టా, హక్కుపత్రాన్ని గిరిజనుడికి ఇప్పించిన దాఖలాలు లేకుండా ప్రభుత్వం రికార్డు సృష్టిస్తుందని ఎద్దేవా చేశారు ఎక్కడా రెగ్యులర్ ప్రాజెక్టు అధికారులు లేకపోవడంతో గిరిజన అభివృద్ధి పూర్తిగా నిర్వీర్యమవుతుందని ఆరోపించారు.

నేటి నుంచి ఎంఎస్ సీవో, అకౌంటెంట్ల నిరవధిక సమ్మె

ఖమ్మం సంక్షేమవిభాగం, న్యూస్‌టుడే: జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో మండల సమాఖ్యల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, అకౌంటెంట్ల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందన లేకపోవడంతో బుధవారం నుంచి వారు నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చారు. ప్రధానంగా కనీస వేతనం రూ.18500 చెల్లించాలని, హెచ్‌ఆర్ పాలసీని వర్తింపజేయాలని, ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని, మహిళా ఉద్యోగులకు ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ప్రభుత్వం, సెర్ప్ ఉన్నతాధికారులు వీరి సమస్యలను పట్టించుకోకపోవడంతో బుధవారం నుంచి నిరవధిక సమ్మె చేయాలని నిర్ణయించినట్టు తెలంగాణ గ్రామీణాభివృద్ధి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.సంపత్‌కుమార్ తెలిపారు.

సత్తుపల్లి

మండల కాంగ్రెస్ ఎస్సీసెల్ అధ్యక్షుడిగా సురేశ్

వేంసూరు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ వేంసూరు మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడుగా కోటమర్తి సురేశ్ నియమితులయ్యారు. మంగళవారం సత్తుపల్లిలో నిర్వహించిన పార్టీ కార్యక్రమంలో మాజీమంత్రి సంభాని చంద్రశేఖర్ సురేశ్‌కు నియామక పత్రం అందజేశారు.

ఫుడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో పాఠశాలకు బల్లలు వితరణ

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లిలోని ఫుడ్‌బ్యాంకు సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎన్టీఆర్ నగర్ ప్రాథమిక పాఠశాలకు బల్లలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫుడ్‌బ్యాంకు నిర్వాహకురాలు ఆశాఖాన్, పాఠశాల హెచ్‌ఎం చిత్తలూరి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సత్తుపల్లి: జాతీయ నాయకులకు చిన్నారుల నివాళి (మా తుజే సలామ్..)



సత్తుపల్లి: జెండా ఆవిష్కరణలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్



సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద..



వేంసూరు: జెండా వందనం చేస్తున్న ఎంపీపీ

ఉద్యమ స్ఫూర్తి.. చైతన్య దీప్తి

☛ వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలు

☛ అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

☛ ఘనంగా స్వాతంత్ర్య దిన వేడుకలు



సత్తుపల్లి గ్రామీణం: మండల పరిషత్ కార్యాలయంలో...

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రభుత్వ, ప్రైవేట్, రాజకీయ పార్టీల కార్యాలయాలు, విద్యాసంస్థల్లో వాడవాడల స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా సాగాయి. మువ్వన్నెల జండాలను ఎగురవేశారు. దేశ స్వాతంత్ర్యం కోసం అసువులు బాసిన అమరవీరులకు నివాళులర్పించారు. విద్యాసంస్థల్లో జరిగిన కార్యక్రమాల్లో స్వాతంత్ర్య స్ఫూర్తిని చిన్నారులకు వివరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. జాతీయ పతాక ఆవిష్కరణ అనంతరం అతిధులుగా పాల్గొన్న అధికారులు మాట్లాడుతూ.. స్వాతంత్రోద్యమ స్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతీయ జండా ఆవిష్కరించారు. ఆ పార్టీ నాయకులు ఉడతనేని అప్పారావు, సత్యనారాయణరెడ్డి, సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

→ న్యాయమూర్తులు యువరాజ్‌గౌడ్, ఉమామహేశ్వరి, ఏసీపి రాజేశ్, సీఐ వెంకటనరసయ్య, తహసీల్దారు పుల్లయ్య, ఎంపీడీవో రవి, ఆర్టీసీ డీఎం వెంకటేశ్వరబాబు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దొడ్డాకుల స్వాతి, సబ్‌జైల్ సూపరిండెంట్ నాంపెల్లి దేవేందర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నరసింహారావు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డా. వెంకటేశ్వర్లు, గ్రంథపాలకులు రామకృష్ణ తదితరులు తమ కార్యాలయాల్లో త్రివర్ణ పథకాలను ఎగురవేశారు. పట్టణంలోని విద్యా సంస్థలు, బ్యాంకులు, ఆసుపత్రులు, అటవీశాఖ, ఎక్సైజ్, ఎల్ఐసి, మార్కెట్‌యార్డు, ఆటోయూనియన్ అడ్డాలు తదితర చోట్ల జాతీయ పతాకాలను ఎగురవేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ శ్రీనివాస్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

సత్తుపల్లి: స్వాతంత్ర్య దిన వేడుకల్లో భాగంగా మంగళవారం సింగరేణిలో 200 వరకు నీడ, పండ్లు ఇచ్చే మొక్కలు నాటారు. సింగరేణి మేనేజర్ వెంకటేశ్వరరావు జాతీయ జండాను ఎగురవేశారు. ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని సింగరేణి ప్రాజెక్టు అధికారి సురేశ్, ఇతర అధికారులు అభినందించారు. త్వరలో కార్మికులకు నివాస సదుపాయం, రవాణా సదుపాయం కల్పిస్తామన్నారు.

తల్లాడ, న్యూస్‌టుడే: తల్లాడ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి కోట అరుణ, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ సరికొండ లక్ష్మీపద్మావతి జాతీయ పతాకాలను ఆవిష్కరించారు. వైద్యాధికారి క్రాంతికుమార్, మోత్యా, ఎస్ఐ మేడా ప్రసాద్, ఎంఈవో దామోదరప్రసాద్, రేంజర్ బి.బాబు, ఛైర్మన్ గుర్రం వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం సలాది రామారావు, తహసీల్దార్ జి.శిరీష తమ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఎగురవేశారు. వివిధ ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

→ విద్యార్థులు దేశం గర్వపడే విధంగా వారి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని, వారికి మంచి భవిష్యత్తు ఉండే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని తల్లాడ ఎంపీపీ సరికొండ లక్ష్మీపద్మావతి, జడ్పీటీసీ సభ్యులు మూకర ప్రసాద్ అన్నారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దిన వేడుకల్లో వారు ప్రసంగించారు. విద్యార్థులకు ఉచిత దుస్తులు పంపిణీ చేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు, ప్రోత్సాహక నగదు అందించారు.

→ తల్లాడలోని తెలంగాణరాష్ట్ర సమితి(తెరాస) పార్టీ కార్యాలయం వద్ద జాతీయ పతాకాన్ని ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి ఆవిష్కరించారు. అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు. ఎంపీపీ సరికొండ లక్ష్మీపద్మావతి, జడ్పీటీసీ సభ్యులు మూకర ప్రసాద్, సర్పంచి కోట అరుణ, రెడ్డెం వీరమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లి గ్రామీణం: గంగారం బెటాలియన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కమాండెంట్ రాంప్రకాశ్

→ తల్లాడ, మల్లవరం గ్రామాల్లో మాజీమంత్రి సంభాని చంద్రశేఖర్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన జాతీయపతాకాన్ని ఆయన ఎగురవేశారు.

సత్తుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ జ్యేష్ట అప్పారావు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీవో ఎన్.రవి, తహసీల్దార్ దొడ్డే పుల్లయ్య, ఈవోఆర్‌డీ దీనమ్మ పాల్గొన్నారు.

→ గంగారం 15వ బెటాలియన్ ఆవరణలో కమాండెంట్ బి.రాంప్రకాశ్ మహాత్మాగాంధీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. సహాయ దళాదిపతులు ఎ.వి.రంగారెడ్డి, వి.నరసింహస్వామి, ఆర్ఐలు సారంగపాణి, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుబల్లి, న్యూస్‌టుడే: మండలంలో ఘనంగా స్వాతంత్ర్య దిన వేడుకలు నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, సీఐ మడత రమేశ్, ఎంపీపీ చీకటి శకుంతల రామారావు, ఎండీవో ప్రభుదాస్, డీఈఈ చంద్రశేఖర్ తమ కార్యాలయాల వద్ద జాతీయ జెండాను ఆవిష్కరించారు. వివిధ కార్యాలయాల వద్ద, పాఠశాలల్లో, వసతి గృహాల వద్ద జాతీయ పతాకాలను ఎగురవేశారు. హమాలీ కార్మికులు ఆధ్వర్యంలో రింగ్ సెంటర్లోని గాంధీజీ విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించారు. గంగదేవిపాడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ప్రవాసాంధ్రురాలు నరుకుళ్ల మమత జాతీయ జెండాను ఆవిష్కరించారు. గణేష్‌పాడులో సర్పంచి గోదా సుబద్ర, వివిధ పంచాయతీల్లో సర్పంచులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. వీఎం బంజర్‌లోని లక్ష్య పాఠశాల ఆధ్వర్యంలో జాతీయ జెండా రంగుల బెలూన్లుతో ప్రదర్శన నిర్వహించారు.

కోండ్రుపాడు(పెనుబల్లి), న్యూస్‌టుడే: కోండ్రుపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన రిషి కన్సెల్‌టెంట్ యాజమాని పానుగంటి నరసింహారావు 6 నుంచి 10 తరగతులలో ప్రతి తరగతిలో ప్రథమ, ద్వితీయ స్థానాలలో ప్రతిభ చూపుతున్న పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు మంగళవారం రూ. 5వేలు నగదు బహుమతులను అందజేశారు.



తల్లాడ: జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న ఎంపీపీ లక్ష్మీపద్మావతి

వేంసూరు, న్యూస్‌టుడే: మండలంలో అధికారులు, ప్రజాప్రతినిధులు మంగళవారం ఘనంగా జండా పండగ నిర్వహించారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీపీ మోటపోతుల జగన్నాథం జాతీయ జెండాను ఆవిష్కరించారు. జడ్పీటీసీ సభ్యుడు గుగ్లోతు బాస్యానాయక్, చల్లా సత్యనారాయణరెడ్డి, బల్లం నాగేశ్వరరావు, ఎంపీడీవో గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. తహసీల్దారు ఎన్‌టి ప్రకాశరావు, వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, మండల విద్యాధికారి వెంకటేశ్వరరావు, ఐకేపీ ఏపీఎమ్ శ్రీనివాసరావు, మండల సమాఖ్య అధ్యక్షురాలు సత్యావతి, సర్పంచి తక్కెళ్లపాటి గోపాలకృష్ణ, సహకార సంఘం అధ్యక్షుడు వెల్ది జగన్మోహనరావు, పోలీస్ ఎస్సై వెంకన్న, వైద్యాధికారి సీతారామ్‌లు తమ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. పలు పాఠశాలల్లో పతాకావిష్కరణలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉషోదయ పాఠశాల విద్యార్థులు వేంసూరు సెంటరునుంచి పోలీస్ స్టేషన్‌వరకు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు.

కల్లూరు, న్యూస్‌టుడే : మండల కేంద్రంలోని పలు కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆర్డీవో కార్యాయలంలో ఆర్డీవో కుముదిని సింగ్ జెండా ఆవిష్కరణచేసి స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ప్రారంభించారు. ఎంపీపీ వలసాల జయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు లీలావతి, తహసీల్దార్ నాగుబాయి, ఎంపీడీవో శివకుమారి, ఎస్సై పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మండలపరిధిలోని పంచాయతీల్లో సర్పంచులు జెండా ఆవిష్కరణ చేశారు. తెలంగాణ గ్రామర్ పాఠశాలలో 500 అడుగుల జాతీయ జెండా ప్రదర్శనను ఎస్సీ కార్పోరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి ప్రారంభించారు.



తల్లాడ: ప్రజాప్రతినిధులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపీడీవో శిరీష



పెనుబల్లి: మండల పరిషత్తు కార్యాలయంలో....



పెనుబల్లి: వీఎం బంజర్ పోలీసుస్టేషన్‌లో ...



కల్లూరు: విద్యార్థుల ర్యాలీని ప్రారంభిస్తున్న పిడమర్తి

సత్తుపల్లి

బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలి

కాకర్లపల్లి (సత్తుపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: బీసీలకు బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించి, చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సబ్‌ప్లాన్ సాధన కమిటీ జిల్లా కార్యదర్శి ఎం.సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని కాకర్లపల్లిలో మండల సదస్సు నిర్వహించారు. గోళ్ల అప్పారావు, కంటి చెన్నారావు, గుంజి రమేశ్ పాల్గొన్నారు.

బైపాస్ సమస్యపై కసరత్తు చేస్తున్నాం : తుమ్మల

సత్తుపల్లి, న్యూస్‌టుడే

ఖమ్మం- అశ్వారావుపేట జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్ సౌకర్యం కల్పించటానికి వైరా, తల్లాడ, కల్లూరు మండల కేంద్రాలకు ఇబ్బంది లేదు. సత్తుపల్లి పట్టణానికి వచ్చే సరికి బైపాస్ ఏర్పాటుకు ఓవైపు సింగరేణి బొగ్గు గనులు, మరోవైపు అటవీ ప్రాంతం, చెరువులు అటంకిగా మారాయి. ఈ రోడ్డు ఏర్పాటుకు స్థలం ఇవ్వటానికి అటవీశాఖ వారు ఎట్టి పరిస్థితిలోనూ ఒప్పుకోక పోవటంతో బైపాస్ సౌకర్యం కష్టంగా మారింది. నాకు అవకాశం ఉన్న మేరకు కేంద్రంతో దెబ్బలాడైనా సరే మీకు ప్రత్యామ్నాయ ప్లాన్‌ను తీసుకు వచ్చి ఇస్తా....

– మంగళవారం ఖమ్మంలో తనను కలసిన సత్తుపల్లి ప్రజలతో ర.భ.శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

జాతీయ రహదారి నిర్మాణం పట్టణం బయట నుంచి చేపట్టాలని కోరుతూ సత్తుపల్లికి చెందిన షుమారు 300 మంది 60 కార్లలో రహదారి వెంట గల వర్తక, వాణిజ్య, భవన యాజమానులు మంగళవారం ప్రదర్శనగా వెళ్లి ఖమ్మంలో రోడ్లు, భవనాలశాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిశారు. పట్టణం నుంచి జాతీయ రహదారి నిర్మాణం చేపడితే రూ. 100 కోట్ల మేర నష్టం జరగటంతో పాటు అనేక కుటుంబాలు వీధిన పడే ప్రమాదముందని మంత్రి తుమ్మలకు వివరించారు. సత్తుపల్లి పట్టణంలో అత్యధిక భాగం ప్రధాన రహదారిని ఆనుకొని ఉండటం వలన ఈ పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఈ సందర్భంగా తుమ్మల వారితో మాట్లాడుతూ సత్తుపల్లి చుట్టూ సింగరేణి ఉపరితల గనులు, అటవీప్రాంతం, చెరువులు ఉండటంతోనే సమస్యగా మారిందన్నారు. సత్తుపల్లిలో సమస్యను గుర్తించే తనకు ఆరోగ్యం సహకరించకున్నా ఇటీవల జాతీయ రహదారి విస్తరణ అధికారులను పిలిచి మాట్లాడినట్టు వివరించారు. పట్టణం నుంచి ఈ రహదారి ఏర్పాటుకు వీలుకాదు. ప్రత్నామ్నాయ మార్గాలు ఆలోచించి వారం రోజుల్లో రెండు, మూడు ప్రణాళికలతో తన వద్దకు రావాలని సూచించినట్లు తెలిపారు. అవి వచ్చాక సత్తుపల్లిలో మీ సమక్షంలోనే చర్చిద్దామన్నారు. అటవీశాఖలో అంగుళం భూమి ఉన్నా రోడ్డు ఏర్పాటుకు అనుమతి రాదన్నారు. పెనుబల్లి మండలంలో కొత్తలంకపల్లి నుంచి కిష్టారం, బాసారం మీదుగా మొద్దులగూడెం వద్ద కలిసేలా ఈ జాతీయ రహదారి ఏర్పాటు చేయలని ప్రయత్నించామని, అటవీ భుములు ఉండటం వలన కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోవటంతో అది సాధ్యం కాలేదని తుమ్మల వివరించారు.



తుమ్మలకు సమస్య విన్నవిస్తున్న పట్టణ ప్రముఖులు

సత్తుపల్లికి దక్షిణంవైపు బైపాసు గురించి ఆలోచించా. ఇటు సింగరేణి బొగ్గుగనులు ఉన్నాయి. మరోవైపు రైల్వే మార్గం రానుంది. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకొని నిర్ణయం తీసుకోవలసి ఉందన్నారు. తుమ్మలను కలసిన వారిలో పట్టణ ప్రముఖులు వనమావాసు, కొత్తూరు ప్రభాకరరావు, గాదిరెడ్డి రాంబాబురెడ్డి, దారా కృష్ణారావు, గంగిశెట్టి ప్రసాద్, కూసంపూడి శ్రీనివాసరావు, తెరాసా నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, గాదె సత్యనారాయణ, చల్లగుళ్ల కృష్ణయ్య తదితరులు ఉన్నారు.

లారీ డ్రైవర్ అదృశ్యం

పెనుబల్లి, న్యూస్‌టుడే: చంద్రుగొండ మండలం అయ్యన్నపాలేనికి చెందిన సద్దాం హుస్సేన్(20) అనే బొగ్గు లారీ డ్రైవర్ అదృశ్యమయ్యాడని అతని తండ్రి బహుదూర్ మంగళవారం వీఎం బంజరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొత్తగూడెం నుంచి సత్తుపల్లికి బొగ్గు నింపుకునేందుకు లారీలో వెళ్తున్న సద్దాం హుస్సేన్ పెనుబల్లి మండలం కొత్తలంకపల్లి వద్ద మంగళవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో ఇద్దరు మహిళలు ఆపు చేశారు. దీంతో మరో లారీ డ్రైవర్ గోపాలస్వామి, సద్దాంహుస్సేన్‌లు వారి వెంట వెళ్లారు. గోపాలస్వామి తిరిగి వచ్చాడు గాని హుస్సేన్ తిరిగి రాకపోవటంతో ఆ లారీ క్లీనర్ బెజవాడ నరసింహారావు, గోపాలస్వామిలు ఆ పరిసర ప్రాంతంలో వెదికారు. అతని ఆచూకి లభించలేదు. సమాచారం తెలుసుకున్న హుస్సేన్ తండ్రి వీఎం బంజర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తల్లాడ, న్యూస్‌టుడే: ఎదురుగా వస్తున్న కారును తప్పించే ప్రయత్నంలో రహదారి పక్కన ఉన్న ద్విచక్రవాహనాన్ని మరో ద్విచక్రవాహనం ఢీకొన్న ప్రమాదంలో సోమారం రాత్రి ముగ్గురికి గాయాలయ్యాయి. హైదరాబాద్ నుంచి ములకలపల్లి మండలం గండిప్రోలు వెళుతున్న ద్విచక్ర వాహనానికి తల్లాడ-భద్రాచలం ప్రధాన రహదారిలో అన్నారుగూడెం వద్ద ఎదురుగా కారు వచ్చింది. దానిని ప్రయత్నంలో పక్కన ఉన్న ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. గండిప్రోలుకు చెందిన కురసం గిరి, అతని భార్య రత్నమ్మ, కుమారై రూతు గాయపడ్డారు. క్షతగాత్రులను ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆటో, లారీ ఢీకొని..

తల్లాడ, న్యూస్‌టుడే: తల్లాడ-భద్రాచలం ప్రధాన రహదారిలో ఆటో, లారీ ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తల్లాడ నుంచి అన్నారుగూడెం వెళుతున్న ఆటో, కొత్తగూడెం నుంచి తల్లాడ వైపు వస్తున్న లారీ తల్లాడకు సమీపంలోని భద్రాచలం ప్రధాన రహదారిలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ లింగం స్టాలిన్, తాళ్లూరి శ్రీనివాసరావు, గుమ్మా హరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వీరిని 108లో ఖమ్మం తరలించారు.

రేషన్ బియ్యం పట్టివేత

వేంసూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని కల్లూరుగూడెం వద్ద సోమవారం అర్ధరాత్రి అక్రమంగా తరలిస్తున్న 6క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. కృష్ణాజిల్లా బూరుగుగూడెంకు చెందిన వెల్లంకి రామచంద్రరావు మోటారుసైకిలుపై 2 క్వింటాళ్లు, పర్వతాపురానికి చెందిన కేశు రాంబాబు టీవీఎస్ మోపెడ్‌పై అంచెంచెలుగా తరలిస్తున్న 4 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని నిందితులిద్దరినీ అదుపులోకి తీసుకున్నారు.

ఓడీఎఫ్ గ్రామంగా చెన్నూరు

కల్లూరు, న్యూస్‌టుడే: సంకల్పం ఒక్కటే కాదు.. కృషి, పట్టుదలతో సమిష్టిగా శ్రమించినప్పుడే అనుకున్న లక్ష్యం సాధించగలరని.. ఇందుకు చెన్నూరు గ్రామం ఆదర్శమని ఆర్డీవో కుముదిని సింగ్ అన్నారు. మంగళవారం చెన్నూరు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి ముఖ్య అతిథులుగా ప్రసంగించారు. ఎంపీడీవోఓ శివకుమారి మాట్లాడుతూ..ఓడీఎఫ్ గ్రామంగా మార్చేందుకు సర్పంచి పాలెపు లక్ష్మికాంతమ్మ, ఆమె కుమారుడు మండల తెరాస అధ్యక్షుడు పాలెపు రామారావు కృషి ఎంతో ఉందన్నారు. అనంతరం చెన్నూరు గ్రామాన్ని ఓడీఎఫ్ గ్రామంగా ఆర్డీఓ కుముదినిసింగ్, పిడమర్తి రవిలు ప్రకటించారు. ఎంపీపీ వలసాల జయలక్ష్మి, జడ్పీటీసీ సభ్యురాలు జర్పుల లీలావతి, ఎంపీటీసీ సభ్యులు, తహసీల్దార్ నాగుబాయి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి ఆర్టీసి డిపో పరిధిలో వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన 25 మంది ఉద్యోగులకు మంగళవారం ప్రశంసా పత్రాలు అందజేశారు. డీఎం వెంకటేశ్వరబాబు, సీఐ మహేశ్‌కుమార్, ఎంఎఫ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు దోమ తెరల పంపిణీ

రేజర్ల (సత్తుపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: మండల పరిధిలోని రేజర్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల అనంతరం జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ విద్యార్థులకు దోమతెరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. గ్రామానికి చెందిన న్యాయవాది వరప్రసాద్‌రెడ్డి పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 24 మంది విద్యార్థులకు దోమ తెరలను వితరణగా ఇచ్చారు.

పాఠశాలకు శుద్ధజల కేంద్రం వితరణ

కుప్పెనకుంట్ల(పెనుబల్లి)న్యూస్‌టుడే: పెనుబల్లి మండలం కుప్పెనకుంట్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు గ్రామానికి చెందిన శీలం సత్యనారాయణరెడ్డి, తల్లపురెడ్డి రామకృష్ణారెడ్డి, ఇడుపులపాటి అనంతకుమార్‌లు రూ.30వేలు వితరణతో శుద్ధజల కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను సర్పంచి శీలం కృష్ణవేణి ప్రారంభించారు.

రూ. 2.60 లక్షల శాశ్వత నిధులు వితరణ

అడసర్లపాడు(వేంసూరు), న్యూస్‌టుడే: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని అడసర్లపాడు ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు రూ. 2.60లక్షలు పాఠశాల శాశ్వత నిధులుగా వితరణ ఇచ్చారు.

ఘనంగా సండ్ర జన్మదిన వేడుకలు

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సత్తుపల్లి ఎంఎల్‌ఏ సండ్ర వెంకటవీరయ్య జన్మదిన వేడుకలు మంగళవారం సత్తుపల్లిలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సండ్ర క్యాంపు కార్యాలయంలో స్వాతంత్ర్య దిన్సోవ జండా ఆవిష్కరణ అనంతరం సండ్ర జన్మదిన కేట్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ బాధ్యులు కూసంపూడి రామారావు, మహేశ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

తల్లాడ, న్యూస్‌టుడే: తల్లాడలో తెదేపా పట్టణ అధ్యక్షుడు దగ్గుల శ్రీనివాసరెడ్డి నివాసంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేతినేని చలపతిరావు, గుండ్ల నాగయ్య, కూచిపూడి వెంకటేశ్వరరావు, రేగళ్ల సత్యం, ఎక్కిరాల సుదర్శన్, బోనాసి కృష్ణమ్మ పాల్గొన్నారు.

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: తెదేపా సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య 49వ జన్మదిన వేడుకలు ఖమ్మంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు తుళ్ళూరి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో కార్యకర్తల మధ్య కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు.

కల్లూరు, వేంసూరు, న్యూస్‌టుడే: సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య జన్మదిన వేడుకలను కల్లూరు మండల తెదేపా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. తెదేపా స్తూపం వద్ద పార్టీ మండల అధ్యక్షుడు కాటంనేని వెంకటేశ్వరరావు కేక్‌కట్‌చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. గొర్రెపాటిరాధయ్య, బోబోలు లక్ష్మణ్‌రావు, సుధాకరాచారి పాల్గొన్నారు. మర్లపాడు ఎంపీటీసీ సభ్యురాలు మందపాటి వెంకాయమ్మ కేక్ కత్తిరించి పంపిణీ చేశారు.



సత్తుపల్లి: కేక్‌ను కత్తిరిస్తున్న తెదేపా బాధ్యులు

పురుగుల మందు పిచికారీతో ఎండిన వరి!

సదాశివునిపాలెం (సత్తుపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: సదాశివునిపాలెంకు చెందిన పర్సా సత్యనారాయణ అనే రైతు తన రెండు ఎకరాల వరి పైరుకు పురుగు మందు చల్లితే పంట ఎండిపోయిందని వాపోయారు. పాస్మోమెడాన్ 50ఈసీ మందును అరలీటరు సోమవారం పిచికారీ చేస్తే మంగళవారానికి చేను పూర్తిగా వాడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై విషయమై మండల వ్యవసాయ అధికారి రామ్మోహన్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని, బుధవారం ఆ పొలాన్ని పరిశీలిస్తానన్నారు.

తితిదే ఆధ్వర్యంలో గోపూజ

కందుకూరు(వేంసూరు), న్యూస్‌టుడే: కందుకూరులోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి పురాతన దేవస్థానంలో శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా తితిదే ఆధ్వర్యంలో గోపూజ, కంకణాల పంపిణీ కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ప్రధాన అర్చకులు నరగిరినాథుని వెంకటాచార్యులు భక్తుల చేత గోపూజ నిర్వహించారు. చల్లా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో తితిదే నుంచి వచ్చిన కంకణాలు, పసుపు, కుంకుమలను భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం 4.00లకు ఉట్టిపండుగను నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు.

మన్యంలో విద్యా, వైద్య రంగాలకు ప్రాధాన్యం

ఐటీడీఏలో ఘనంగా జెండా పండుగ

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం మన్యంలో గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఆర్డీవో శివనారాయణరెడ్డి తెలిపారు. ఐటీడీఏలో మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవ కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. జాతీయ నాయకుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆర్డీవో జాతీయ జెండాను ఎగుర వేసి వందన సమర్పణ చేశారు. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఆర్డీవో మాట్లాడుతూ... ఈ ఏడాది 321 విద్యా సంస్థల్లో 31,778 విద్యార్థులు ప్రభుత్వం ద్వారా అందించే ప్రయోజనాలు పొందుతున్నారని తెలిపారు. గడిచిన విద్యా సంవత్సరం పదిలో 84 శాతం ఫలితాలు సాధించారని తెలిపారు. పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు రూ.7.17 కోట్లు మంజూరవ్వగా రూ.2.27 కోట్లను చెల్లించినట్లు తెలిపారు. 6792 మంది విద్యార్థులు లబ్ధి పొందారని అన్నారు. వైద్యపరంగా సత్వర వైద్యం అందించి మెరుగైన ఫలితాలు సాధించినట్లు తెలిపారు. 1701 మందికి ఇప్పటి వరకు కేసీఆర్ కిట్‌లను అందించామన్నారు. 29 పీహెచ్‌సీలలో ర్యాపిడ్ ఫీవర్ సర్వే జరిగిందన్నారు. ఇంజినీరింగ్ విభాగం పనుల్లో పురోగతి ఉందన్నారు. బిల్డింగ్ ఫర్ స్కూల్ కాంప్లెక్స్ పథకంలో రూ.28.36 కోట్లతో 37 పనులు మంజూరవ్వగా 22 పనులు పూర్తయి మిగిలినవి పురోగతిలో ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సున్నం రాజయ్య, సర్పంచి శ్వేత, ఎంపీపీ శాంతమ్మ, జడ్పీటీసీ సభ్యులు రవికుమార్, ఐటీడీఏ ఏపీవో జనరల్ భీమ్‌రావు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రామమూర్తి, అడిషనల్ డీఎంహెచ్‌వో డా. సింగరాజు, గురుకులం ఆర్సీవో షేక్ బురాన్, ఎస్‌డీసీ వెంకటేశ్వర్లు, మేనేజర్ శ్రీహరి చేతుల మీదుగా అందించారు. ఏటీవో రమణయ్య, ఏవో తాతారావు, యూనిట్ అధికారులు బలరాం, చలపతి, నాగులు, తారాచంద్, జయశ్రీ పాల్గొన్నారు.


ప్రశంసాపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే రాజయ్య, ఆర్డీవో శివనారాయణరెడ్డి

ఐటీడీఏని ఏం చేయనున్నారు

ఈసారి జెండా పండుగ జరిగిన తీరుకు ఐటీడీఏలోని కొంతమంది సిబ్బంది నొచ్చుకున్నారు. ఐటీడీఏ ఉంటుందా? జిల్లా కేంద్రానికి తరలి పోతుందా అన్న నేపథ్యంలో జెండాను ఆర్డీవో ఎగురవేశారు. ఇన్‌ఛార్జి పీవో రాజీవ్‌గాంధీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు కలెక్టర్‌గా ఉన్నందున రాలేకపోయారు. జేసీ, ఏపీవో జనరల్ రాకపోవడంతో డివిజన్ అధికారి జెండా పండుగను దగ్గరుండి జరిపించారు.

800 మెగావాట్ల విద్యుత్తు ప్లాంటు ఏర్పాటుకు ప్రయత్నాలు

స్వాతంత్ర్య వేడుకల్లో సింగరేణి సీఎండీ

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రగతిలో సింగరేణి సంస్థ వెలుగులు నింపేందుకు ప్రయత్నాలు చేస్తోందని ఆ సంస్థ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.శ్రీధర్ ఉద్ఘాటించారు. భద్రాద్రికొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సింగరేణి ప్రకాశం మైదానంలో మంగళవారం స్వాతంత్ర్య వేడుకలు ఘనంగా కొనసాగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీధర్ మాట్లాడుతూ రాష్ట్ర బొగ్గు అవసరాలను తీర్చడంతోపాటు 1200 మెగావాట్లను సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం ద్వారా అందిస్తోందన్నారు. మంచిర్యాల జిల్లా జైపూర్‌లో సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం నెలవారీ ప్లాంటు లోడ్ ఫ్యాక్టర్(పీఎల్‌ఎఫ్) సాధించడంలో దేశంలోనే అత్యుత్తమ ప్రాజెక్టుల్లో ఒకటిగా నిలుస్తోందన్నారు. రెండు 600ల మెగావాట్ల సామర్థ్యం గల యూనిట్లతో తొమ్మిది నెలల కాలంలో వంద శాతం పీఎల్‌ఎఫ్ సాధించి రికార్డు నెలకొల్పిందన్నారు. సింగరేణి థర్మల్ విద్యుత్తు కేంద్రం ద్వారా ఇప్పటికే 7వేల మిలియన్ యూనిట్ల విద్యుత్తును అందించినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మరో 800 మెగావాట్ల ప్లాంటు ఏర్పాటుకు ఆదేశించడంతో అందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పర్యావరణ హితంగా సౌర విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి నిర్ణయించినట్లు తెలిపారు. అతి త్వరలో సింగరేణిలో కొన్ని ఏరియాల్లో 50 నుంచి 100 మెగావాట్ల సామర్థ్యం ఉన్న సౌర ప్లాంట్లను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన హరితహారంలో భాగంగా 2015లో 40 లక్షలు, 2016లో కోటి మొక్కలు నాటినట్లు చెప్పారు. ఈ ఏడాది సైతం కోటి మొక్కలు నాటాలనే లక్ష్యంతో ఇప్పటికే 67 లక్షల మొక్కలు నాటి సింగరేణి కాలరీస్ సంస్థలో కొత్త చరిత్రను సృష్టించామన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు బొగ్గు పరిశ్రమల్లో 15రోజులపాటు స్వచ్ఛ పక్వాడ అమలు చేయనున్నట్లు తెలిపారు.


వేడుకల్లో ప్రసంగిస్తున్న సింగరేణి సీఎండీ శ్రీధర్


స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్సీ బాలసాని, పోట్ల

మంత్రి తుమ్మలకు ఘనస్వాగతం

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఇటీవల అస్వస్థతకు గురైన అనంతరం మంగళవారం ఖమ్మం వచ్చిన రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. నగరంలోని సర్ధార్‌పటేల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ వద్ద ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే మదన్‌లాల్, మేయర్ డాక్టర్ పాపాలాల్, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, తెరాస జిల్లా పార్టీ అధ్యక్షుడు బుడాన్‌బేగ్, నగర అధ్యక్షుడు కె.మురళి, నాయకులు పి.నాగేశ్వరరావు, బి.నాగాచంద్రారెడ్డి, ఏ.వెంకటరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, మహిళా నాయకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీస్‌పెరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొన్నారు. అక్కడనుంచి పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆఫీసర్స్ అతిథి గృహంలో సత్తుపల్లి నుంచి వచ్చిన నాయకులను కలిశారు. జాతీయ రహదారి వల్ల కొన్ని సమస్యలున్నాయని, దానిని మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని కోరగా, దానికి మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించారు. దీనికి ముందు ఖమ్మం శాసనసభ్యుడు పువ్వాడ అజయ్‌కుమార్ ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

సామాన్యుడికి రాజ్యాంగ హక్కు అందించడం న్యాయస్థానాల బాధ్యత

ఖమ్మం న్యాయంవిభాగం, న్యూస్‌టుడే: స్వాతంత్ర్య భారతదేశంలో రాజ్యాంగం సామాన్యుడికి కల్పించిన హక్కు వారికి అందించడం న్యాయస్థానాల బాధ్యత అని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.లక్ష్మణ్ అన్నారు. 71వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయస్థానాల సముదాయంలో జాతీయ జెండా ఆవిష్కరించిన అనంతరం న్యాయమూర్తి ప్రసంగిస్తూ హక్కుల కోసం పోరాడుతన్న సామాన్యుడి అంతిమ గమ్యం న్యాయస్థానాలేనని, ఈ నమ్మకాన్ని న్యాయవ్యవస్థ నిలబెట్టుకోవాలన్నారు. వ్యవస్థలో సమస్యలు, సంఘర్షణ వాంఛనీయమని వాటిద్వారానే పరిణితి వస్తుందన్నారు. సత్వర న్యాయం సమర్థంగా అందించే క్రమంలో అంతర్గత సమస్యలు అడ్డు కాకూడదన్నారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదంపై పోరాడి మనం స్వాతంత్ర్యం తెచ్చుకున్నామని జిల్లా బార్ అధ్యక్షుడు పి.పట్టాభి అన్నారు. జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కోర్టుల్లో ఉద్యోగుల ఎంపిక ప్రక్రియ జరగాలన్నారు. తద్వార ఉద్యోగులపై పనిబారం తగ్గుతుందన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడల్లో విజేతలకు జిల్లా జడ్జి ఎం.లక్ష్మణ్, అదనపు జిల్లా జడ్జి ఎన్.ప్రేమలత బహుమతులు ప్రదానం చేశారు. భారతదేశంలో ఆదివాసి గిరిజన బిడ్డ మొట్టమొదటిసారి ఉస్మానియా యూనివర్సిటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం పొందిన న్యాయవాది ఆదివాసి మహిళ ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య కుమార్తె అనురాధను సన్మానించారు. ఆమెకు జ్ఞాపికను జిల్లాజడ్జి బహూకరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు లలిత కుమారి, ఎం. వెంకటరమణ, అపర్ణాదేవి, రెహెనా, ప్రభుత్వ న్యాయవాది కాటంనేని రమేష్, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


జెండాకు వందనం చేస్తున్న న్యాయమూర్తి, తదితరులు

ఎన్నారై జాగృతి సేవలను విస్తృతం చేస్తాం: బిందులత

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎన్నారైల సహకారంతో జాగృతి సేవలను విస్తృతం చేస్తామని ఎన్నారై జాగృతి అమెరికా సలహాదారు చీదెళ్ల బిందులత తెలిపారు. జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం రఘునాథపాలెం మండలంలోని మైనారిటీ గురుకుల బాలికల పాఠశాలను ఆమె సందర్శించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో పాల్గొన్న అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత పిలుపు మేరకు అమెరికాలో ఉంటున్న తాను ఎన్నారై తరపున జాగృతిలో చేరడం జరిగిందన్నారు. గత కొంతకాలంగా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో పర్యటించి స్థానిక సమస్యలను అధ్యయనం చేస్తున్నామన్నారు. దీనిలో భాగంగా రఘునాథపాలెం తహసీల్దారు కార్యాలయాన్ని సందర్శించి రైతుల సమస్యలను తెలుసుకున్నామన్నారు. ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే పువ్వాడ అజయ్‌కుమార్‌లను కలిసి ఎన్నారై ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. ఇక్కడ ఇంటర్నేషనల్ స్కూల్, హైదరాబాదు లుంబినీ పార్కు తరహాలో ఖమ్మంలో పార్కు ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జాగృతి అధికార ప్రతినిధి బాణోతు రాంబాబు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బిందులత

డాక్టర్ విజయ్‌కుమార్‌కు ప్రముఖుల నివాళి

కొత్తగూడెం రామవరం, న్యూస్‌టుడే: నల్గొండ జిల్లా కట్టంగూర్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కొత్తగూడెం పట్టణ వైద్యుడు మద్దికాయల విజయ్‌కుమార్, డాక్టర్ ఝాన్సీ తల్లి సావిత్రిబాయి మృతదేహాలను మంగళవారం తెల్లవారుజామున కొత్తగూడెంలోని వారి స్వగృహానికి తీసుకొచ్చారు. వారి మృతదేహాలను కొత్తగూడెం శాసనసభ్యుడు జలగం వెంకటరావు, మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా, కాంగ్రెస్ నాయకుడు ఎడవల్లి కృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శి కాసాని అయిలయ్యలతో పాటు ఐఎంఏ బాధ్యులు, రాజకీయ ప్రముఖులు, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి బంధుమిత్రులు సందర్శించి నివాళులు అర్పించారు. ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఆస్ట్రేలియా నుంచి మృతుల బంధువులు రావాల్సి ఉన్నందున వారు వచ్చిన తర్వాతే అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు సన్నిహితులు తెలిపారు. వరంగల్ నుంచి వచ్చిన ఎంసీపీఐ(యూ) బాధ్యులు విజయ్‌కుమార్ మృతదేహంపై పార్టీ పతాకాన్ని ఉంచి, నివాళులు అర్పించినట్లు బంధువులు తెలిపారు.



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న జలగం వెంకటరావు

అపస్మారక స్థితిలో డాక్టర్ ఝాన్సీలక్ష్మి

కట్టంగూరు, న్యూస్‌టుడే: శుభకార్యానికి వెళ్తూ నల్గొండ జిల్లా కట్టంగూరు మండలం ఎర్రసానిగూడెం స్టేజీ వద్ద సోమవారం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డాక్టర్ ఝాన్సీలక్ష్మి హైదరాబాద్ కామినేని ఆసుపత్రిలో వెంటిలేటర్ ద్వారా చికిత్స అందిస్తున్నారని, ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వారి కుటుంబ సన్నిహితుడు తెలిపారు. ఝాన్సీలక్ష్మి భర్త, తల్లి విజయ్‌కుమార్, సావిత్రిబాయి మృతదేహాలను సోమవారం రాత్రి కొత్తగూడెంలోని హర్ష మెటర్నిటి, జనరల్ ఆసుపత్రికి తరలించారు. ఆస్ట్రేలియాలో ఉన్న విజయ్‌కుమార్ సోదరి రాగానే అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కాలు విరిగిన శోభను నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రి నుంచి సోమవారం రాత్రి కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఝాన్సీలక్ష్మి స్పృహలోకి రాకపోవడంతో, తన భర్త, తల్లిని రోడ్డు ప్రమాదం పొట్టనబెట్టుకుందనే సమాచారం ఆమెకు తెలియలేదు.

డ్రైవర్ పరారీలో.. రోడ్డు ప్రమాదానికి కారణమైన ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ పరారీలో ఉన్నట్లు సీఐ విశ్వప్రసాద్ తెలిపారు. ప్రమాదానికి గురైన కారు, ట్యాంకర్‌ను స్టేషన్‌కు తరలించారు.



హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న ఝాన్సీలక్ష్మి

మానేరు జలాశయంలో పడి వ్యక్తి మృతి

కరీంనగర్ గ్రామీణం, న్యూస్‌టుడే : ప్రమాదవశాత్తు చింతకుంట శివారులోని దిగువ మానేరు జలాశయంలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. కొత్తపల్లి ఠాణా ఎస్సై రమేష్ తెలిపిన వివరాల మేరకు.. కరీంనగర్‌లోని కాపువాడకు చెందిన ఎన్.వేణుగోపాల్(40) పాల్వంచలోని టీఎస్ జెన్‌కోలో డీఈగా పనిచేస్తున్నారు. మంగళవారం జలాశయం వద్దకు ఉదయపు నడకకు వెళ్లాడు. నడక పూర్తయిన తర్వాత కాళ్లు చేతులు శుభ్రం చేసుకునేందుకు బోటింగ్ ప్రాంతంలో నీళ్లలోకి దిగి లోతుకు జారిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతి చెందాడు. మృతుడి తండ్రి రఘుపతిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ఏన్కూరు, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సోమవారం అర్ధరాత్రి ఏన్కూరు పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీసులు రాత్రి గస్తీలో ఉన్న సమయంలో కొణిజర్ల మండలం అంజనాపురం నుంచి జూలూరుపాడు వెళ్తున్న బొలేరో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. రేషన్ బియ్యం పట్టుపడటంతో వాహనాన్ని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్సై తోట నాగరాజు పౌరసరఫరాల శాఖ అధికారులకు సమాచారం అందించారు.

మహిళ మృతిపై కేసు నమోదు

సుజాతనగర్, న్యూస్‌టుడే: సోమవారం విద్యుదాఘాతానికి గురైన అరుణ(30) మృతిపై కేసు నమోదు చేసినట్లు సుజాతనగర్ పోలీసులు తెలిపారు. మండల పరిధిలోని సింగభూపాలెం గ్రామానికి చెందిన అరుణ సోమవారం రాత్రి బట్టలు ఆరవేస్తుండగా ప్రమాదవశాత్తు ఇనుప దండెంకు విద్యుత్ సరఫరా అయ్యి మృతి చెందిన విషయం విధితమే. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం 174 సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గుట్కా దుకాణాలపై పోలీసుల దాడులు

ములకలపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని ములకలపల్లి, జగన్నాథపురం గ్రామాలలో గుట్కాలు విక్రయిస్తున్న దుకాణాలపై మంగళవారం స్థానిక ఎస్సై రవిందర్ తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. అనంతరం ఎస్సై రవిందర్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ములకలపల్లి, జగన్నాథపురం కేంద్రాలలో అక్రమంగా గుట్కా, ఖైనీ, అంబర్ ప్యాకెట్లు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ములకలపల్లి, జగాన్నాథపురం గ్రామాలకు చెందిన ఓబులశెట్టి ప్రదీప్, ఒంటిపల్లి సత్యప్రసాద్, సముద్రాల నాగేశ్వరరావుల కిరాణా దుకాణాలలో రూ. 80వేల విలువ చేసే 16,500 గుట్కా ప్యాకెట్లు పట్టుబడ్డాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకొని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

108 వాహనంలో గర్భిణి ప్రసవం

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: 108 వాహనంలో ఓ గిరిజన మహిళను చికిత్స కోసం తరలిస్తుండగా మార్గం మధ్యలో మగబిడ్డకు జన్మనిచ్చిన ఘటన మంగళవారం మైలారంలో చోటు చేసుకుంది. 108 సిబ్బంది వివరాల ప్రకారం.. పాల్వంచ మండలం తుమ్మలగూడెంకు చెందిన కుంజా ప్రభావతి(20)కి నెలలు నిండడంతో మంగళవారం కాన్పు కోసం కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నారు. పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో మైలారం గ్రామ శివారులో ఆమె 108 వాహనంలోనే మగబిడ్డకు జన్మనిచ్చింది. వెంటనే తల్లిబిడ్డలను 108 సిబ్బంది మాధవరావు, సాయికృష్ణ దగ్గరలోని రేగళ్ల పీహెచ్‌సీకి తరలించి మెరుగైన సేవలను అందించారు. తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.



ప్రసవించిన బిడ్డతో ప్రభావతి

ప్రధానోపాధ్యాయుడు రమణయ్య సస్పెన్షన్

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా బోనకల్లు జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.రమణయ్యను సస్పెండ్ చేశారు. ఈమేరకు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.విజయలక్ష్మిబాయి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదే పాఠశాలలోని బాలికలను లైంగికంగా వేధించటం, విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించినందుకు ఉన్నతాధికారులు ఆయనపై సస్పెన్షన్ వేటు వేశారు. ఆయన ప్రవర్తన గురించి గతంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీనిపై విచారణ జరిపి రమణయ్యపై చర్య తీసుకున్నారు.

చదువును వదులుకోలేక తనువు చాలించి...

★ యువతి ఆత్మహత్య

వాజేడు, న్యూస్‌టుడే: చదువంటే ఆ యువతికి ఎనలేని ఇష్టం.. చదువుకోవాలని ఉన్నా కుటుంబంలోని ఆర్థిక ఇబ్బందులతో కష్టం.. తండ్రి లేడు.. అక్కకు ఈ ఏడాది జూన్‌లో పెళ్లి చేశారు. పెళ్లికి చేసిన అప్పులే తీరలేదు.. కుటుంబం గడవాలంటే కూలి పనులు చేసుకోవాల్సిందే.. చదువుకుంటానమ్మా అంటే ఈ ఏడాది అమ్మ వద్దంది.. చదువును వదులుకోలేక పుస్తకాలపై మమకారాన్ని చంపుకోలేక యువతి తనువు చాలించిన సంఘటనతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా వాజేడు మండలం కృష్ణాపురం గ్రామంలో తీరని విషాదాన్ని నింపింది. పేరూరు ఎస్సై శివప్రసాద్ కథనం మేరకు... కృష్ణాపురం గ్రామానికి చెందిన సప్కా రత్నమ్మకు ఇద్దరు కూతుళ్లు. పిల్లల చిన్నతనంలోనే భర్త మృతి చెందాడు. ఇద్దరు కూతుళ్లలో పెద్దామెకు నెలన్నర కిందట పెళ్లి చేశారు. చిన్నకూతురు సప్కా పుష్ప(18) ఈ ఏడాది ఇంటర్ పూర్తి చేసింది. ఏటూరు నాగారంలో డిగ్రీ చదువుతానంటూ తల్లిని ఒప్పించేందుకు శతవిధాలా ప్రయత్నించింది. ఆర్థిక ఇబ్బందులతో చదివించేందుకు తల్లి నిరాకరించింది. అక్క పెళ్లికి చేసిన అప్పులు తీర్చిన తరువాత వచ్చే ఏడాది చదువుకునేందుకు పంపిస్తానంటూ కూతురికి తల్లి నచ్చజెప్పింది. చదువుకు దూరమయ్యాననే బాధతో ఇష్టం లేకపోయినా తల్లితో కలిసి కూలి పనులకు వెళ్లసాగింది. చదువుకోవాలనే మమకారాన్ని చంపుకోలేక, తల్లి మాటను పాటించలేక సోమవారం సాయంత్రం పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. బంధువులు గుర్తించి ఆసుపత్రికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగానే మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలి తల్లి రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



విగతజీవిగా పుష్ప

గేదెను ఢీకొన్న ద్విచక్ర వాహనం

ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు




సురేశ్ మృతదేహం

కారేపల్లి, న్యూస్‌టుడే: పాడిగేదెను ద్విచక్ర వాహనం ఢీ కొనటంతో ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి గాయాలు అయిన ఘటన మంగళవారం రాత్రి బజ్జతండా ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విశ్వనాథపల్లికి చెందిన కె. సురేశ్ (36)తో పాటు మరో ఇద్దరు ద్విచక్ర వాహనంపై కారేపల్లి నుంచి స్వగ్రామానికి వెళుతున్నారు. ఈ క్రమంలో బజ్జతండా స్టేజీ వద్ద రహదారిపై వెళుతున్న పాడి పశువును గమనించక ఢీకొన్నారు. దీంతో సురేశ్‌ను కారేపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందనట్లు వైద్యులు చెప్పారు. మరో ఇద్దరిని అక్కడే ఉన్న ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రహదారి పక్కకు దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదానికి కారణమైన కారు వద్ద గుమిగూడిన ప్రయాణికులు

చింతకాని, న్యూస్‌టుడే: ఒక కారు డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగా ఆర్టీసీ బస్సు రోడ్డు పక్కన ఉన్న గోతిలోకి దూసుకెళ్లిన సంఘటన మండల పరిధిలోని తిరుమలాపురం సమీపంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం నుంచి కృష్ణా జిల్లా పోలంపల్లికి వెళ్తున్న ఆర్టీసీ బస్సుకు తిరుమలాపురం సమీపంలో ఎదురుగా వస్తున్న కారు అదుపు తప్పి బస్సుపైకి దూసుకొచ్చి ఢీకొంది. బస్సు డ్రైవర్ వేగంగా ఉన్న బస్సును అదుపు చేసే లోపే అది రోడ్డు పక్కన ఉన్న గోతిలోకి దూసుకెళ్లింది. బస్సు రోడ్డు పక్కకు దూసుకెళ్లిన ప్రాంతానికి సమీపంలో ఒక భారీ వృక్షం ఉంది. బస్సు చెట్టుకు ఢీకొని ఉంటే ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు పేర్కొన్నారు. బస్సు ఒక్క సారిగా కుదుపులకు గురికావటంతో ప్రయాణికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. డ్రైవర్ అప్రమత్తతో ప్రయాణికులు క్షేమంగా ఉన్నారు. ఆందోళనకు గురయిన ప్రయాణికులు వేరే వాహనాల్లో గమ్యస్థానాలకు చేరారు.



కొత్తగూడెం పట్టణం: ప్రకాశం మైదానంలో శారదాకుటీర్ విద్యార్థుల నృత్య ప్రదర్శన



భద్రాచలం ఐటీడీఏలో జాతీయ జెండా గొప్పదనాన్ని చాటుతున్న విద్యార్థులు



కొత్తగూడెం: సెయింట్ మేరీస్ పాఠశాల విద్యార్థినుల నృత్య ప్రదర్శన



కొత్తగూడెం: ఐటీడీఏ శకటం ఎదుట కొమ్ము నృత్య ప్రదర్శన



కొత్తగూడెం ప్రకాశం మైదానంలో ఆకట్టుకున్న నృత్య రూపకం

జనగణమన పరవశం

ఉత్సాహంగా స్వాతంత్ర్య వేడుకలు

సంబురాలు అంబరాన్నంటాయి. మువ్వన్నెల జెండాలు రెపరెపలాడాయి. ప్రతి మదినిండా దేశభక్తి భావం పెల్లుబికింది. 'భారత్ మాతాకీ జై.. వందేమాతరం' అంటూ నినాదాలు వాడవాడలా మార్మోగాయి. అన్నిచోట్లా జాతీయ భావం తొణికిసలాడింది. ఏడు పదులు పూర్తి చేసుకున్న స్వతంత్ర భారతం, మరింత ప్రగతి పథంలో పయనించేలా చేస్తామని నేతలు ప్రతినబూనారు. విద్యాలయాల్లో జాతీయ నాయకుల వేషధారణలో విద్యార్థులు అలరించారు. కొత్తగూడెం ప్రగతి మైదానం, ఖమ్మం నగరంలో పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన సాంస్కృతిక ప్రదర్శనలు వీక్షకులను కట్టిపడేశాయి. నృత్య రూపంలో వారిచ్చిన సందేశం ఆలోచింపజేసింది. స్వాతంత్ర్య వేడుకలను మంగళవారం ఉభయ జిల్లాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, పరిశ్రమలు, పార్టీ కార్యాలయాల్లో జెండా వందనం చేశారు. ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే



ఖమ్మం: పరేడ్ మైదానంలో జీపుపై మంత్రి తుమ్మల, కలెక్టర్, సీపీ



ఖమ్మం: జెండా వందనం చేస్తున్న జడ్పీ అధ్యక్షురాలు కవిత



వైరా: క్యాంపు కార్యాలయంలో వైరా ఎమ్మెల్యే మదన్‌లాల్ తదితరులు



తల్లాడలో జెండావిష్కరణ చేస్తున్న పిడమర్తి రవి



ఖమ్మం: బాలాజీనగర్ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రదర్శన



కూసుమంచి: పాలేరు నవోదయ విద్యాలయంలో జాతీయ నాయకుల వేషధారణ



జెండాకు వందనం చేస్తున్న కలెక్టర్ లోకేశ్‌కుమార్



జిల్లా అభివృద్ధి నివేదికను పరిశీలిస్తున్న మంత్రి పద్మారావు, వేదికపై ఎమ్మెల్యేలు జలగం, కోరం కనకయ్య తదితరులు






భద్రాచలం ఐటీడీఏలో మూడు రంగుల జెండా చేతపట్టిన విద్యార్థిని



కొత్తగూడెం: జాతీయ జెండా, గాంధీ వేషధారణలో గౌతం మోడల్ స్కూల్ విద్యార్థులు




చింతకాని మండలం రామకృష్ణాపురం ఉన్నత పాఠశాలలో రంగుల దేశ చిత్రపటం



ఖమ్మంలో విద్యార్థిని అద్భుత విన్యాసం







ఖమ్మం పరేడ్ మైదానంలో కార్యక్రమాలను తిలకిస్తున్న ఎమ్మెల్యే అజయ్, తాటి, మదన్‌లాల్, జడ్పీ అధ్యక్షురాలు కవిత, పిడమర్తి రవి, ఆర్జేసీ కృష్ణ, మేయర్ పాపాలాల్, బాలసాని తదితరులు





జెండావందనంలో భారజల ప్లాంటు జీఎం జితేంద్ర శ్రీవాత్సవ



మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో...



ఐటీడీఏ శకటం ఎదుట కల్యాణలక్ష్మీ, విద్యార్థుల ఉపకార వేతనాలకు సంబంధించిన ప్రదర్శనలో యువతీ, యువకులు



ఖమ్మం: వైద్య ఆరోగ్య శాఖ శకటం



నేలకొండపల్లిలో 226 మీటర్ల జాతీయ పతాక ప్రదర్శన



300 అడుగుల పొడవైన జాతీయ జెండాతో ఖమ్మం శ్రీ చైతన్య విద్యార్థుల ప్రదర్శన



కొత్తగూడెం పట్టణం: ఎస్ఆర్‌డీజీ పాఠశాల విద్యార్థుల అద్భుత ప్రదర్శన



సింగరేణి సీఎండీ ఎన్.శ్రీధర్‌ను తోడ్కొని వస్తున్న దృశ్యం



కొత్తగూడెం: వెదురు ఆకృతులను పరిశీలిస్తున్న మంత్రి



ఖమ్మం: ఆకట్టుకున్న జడ్పీహెచ్ఎస్ పొన్నెకల్ విద్యార్థుల విన్యాసం

ఆద్యంతం ఆనందోత్సాహం

★ దుమ్మురేపిన జిమ్నాస్టిక్స్
★ అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ఖమ్మంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో నిర్వహించిన స్వాతంత్ర్య వేడుకల్లో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో జిమ్నాస్టిక్స్ క్రీడాకారులు దుమ్మురేపారు. బాలికల విన్యాసాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేశాయి. యువకులు, బాలికలు విన్యాసాలు ప్రదర్శిస్తున్న సమయంలో మైదానంలోని వారంతా ఒళ్లంతా కళ్లు చేసుకుని చూశారు. వేదికపై ఉన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ లోకేశ్‌కుమార్, సీపీ తఫ్సీర్ ఇక్బాల్ సహా హాజరైన ప్రజా ప్రతినిధులు, అధికారులు, పుర ప్రజలు ఆసక్తిగా చూశారు.

☛ అంతకు ముందు పలు పాఠశాలల విద్యార్థులు దేశ సమగ్రత, సమైక్యతను చాటుతూ ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. కామేపల్లి మండలం పొన్నేకల్లు జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థినులు గిరిజన సంప్రదాయ వేషధారణతో ఐ లవ్ మై ఇండియా గీతానికి నృత్య ప్రదర్శన చేశారు. ఖమ్మం బాలాజీ నగర్ జడ్పీహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు, ఖమ్మం అర్బన్ కేజీబీవీ పాఠశాల విద్యార్థులు, ఖమ్మంలోని కృష్ణ ప్రసాద్ మెమోరియల్ పాఠశాల, హార్వెస్ట్ పాఠశాల విద్యార్థుల నృత్య రూపకాలు అలరించాయి.

☛ జాతీయ పతాకం ఎగుర వేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఓపెన్ టాప్ జీప్‌లో మంత్రి తుమ్మల, కలెక్టర్ లోకేశ్‌కుమార్, సీపీ తఫ్సీర్ పెరేడ్ మైదానంలో తిరుగుతూ అభివాదం చేశారు.

☛ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లా జడ్జి ఎం. లక్ష్మణ్, జడ్పీ అధ్యక్షురాలు గడిపల్లి కవిత, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ డాక్టర్ పాపాలాల్, ఉప మేయర్ మురళీ ప్రసాద్, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, డీసీసీబీ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ సయ్యద్ బుడన్‌బేగ్, ఎస్సీ కార్పొరేషన్ ఛైర్మన్ పిడమర్తి రవి, ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఆర్జేసీ కృష్ణ, జేసీ వినయ్‌కృష్ణారెడ్డి, శిక్షణ కలెక్టర్ హనుమంత్ కొడింబ, జడ్పీ సీఈఓ మారుపాక నాగేశ్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, నగర పౌరులు పాల్గొన్నారు. వేడుకలకు హాజరైన ప్రముఖుల వద్దకు మంత్రి తుమ్మల వెళ్లి వారితో కరచాలనం చేశారు. స్వాతంత్ర్య సమరయోధులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శాలువా కప్పి సత్కరించారు.



విన్యాసాలు చేస్తున్న విద్యార్థులు

☛ వివిధ ప్రభుత్వ శాఖలు అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను శకటాల రూపంలో ప్రదర్శించాయి. రహదారులు, భవనాల శాఖ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శకటంపై రెండు పడక గదుల ఇల్లు నమూనా అందరినీ ఆకట్టుకుంది. వ్యవసాయ శాఖ, డీఆర్డీఏ, వైద్య ఆరోగ్య శాఖ, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ, ట్రాన్స్‌కో, అటవీశాఖ, 108, 104 సేవలు, శకటాలు ప్రదర్శించారు.

☛ పోలీస్ పెరేడ్ మైదానంలో వివిధ ప్రభుత్వ శాఖలు ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేశాయి. వీటిని కలెక్టర్ లోకేశ్‌కుమార్, శిక్షణ కలెక్టర్ హన్మంత్ కొడింబా ప్రారంభించారు.

☛ వేడుకల్లో రూ.38.76 కోట్ల విలువైన ఆస్తులు లబ్ధిదారులకు మంత్రి తుమ్మల పంపిణీ చేశారు. డీఆర్డీఏ ద్వారా బ్యాంకు లింకేజి కింద రూ.21.80 కోట్లు, స్త్రీ నిధి రుణాలకు సంబంధించి రూ.18 కోట్లు, మెప్మా ద్వారా బ్యాంకు లింకేజి కింద రూ.5.20 కోట్లు, వడ్డీలేని రుణాల కింద రూ.1.30 కోట్లు, వ్యక్తిగత రుణాలకు సంబంధించి రూ.లక్ష చొప్పున 6 యూనిట్లు, ఐసీడీఎస్ ద్వారా రూ.93వేల వ్యయంతో కూడిన ద్విచక్ర వాహనాలు లబ్దిదారులకు అందించారు.



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వద్ద జెండా ఎగురవేస్తున్న ఛైర్మన్ మువ్వా విజయబాబు



వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద జెండా ఎగురవేస్తున్న అధ్యక్షుడు ఆర్జేసీ కృష్ణ

జడ్పీలో జాతీయ జెండా ఎగుర వేసిన కవిత

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: భారత దేశ 71వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని మంగళవారం ఖమ్మంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలో జడ్పీ అధ్యక్షురాలు గడిపల్లి కవిత జాతిపిత మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం జాతీయ పతాకాన్ని ఎగుర వేసి వందనం చేశారు. ఉప సీఈఓ భారతి నవభారత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ మారుపాక నాగేశ్, పీఆర్ ఈఈ సాంబయ్య, డీఈ మహేశ్‌బాబు, పలువురు జిల్లా పరిషత్ ఉద్యోగులు హాజరయ్యారు.

☛ జిల్లా పరిషత్ కార్యాలయం ఆవరణలోని తెలంగాణ పీఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ భవనం వద్ద జాతీయ జెండాను జడ్పీ అధ్యక్షురాలు గడిపల్లి కవిత ఎగుర వేశారు. క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ లోకేశ్‌కుమార్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. కలెక్టరేట్ ఆవరణలో జేసీ వినయ్ కృష్ణారెడ్డి జాతీయ పతాకాన్ని ఎగుర వేశారు. శిక్షణ కలెక్టర్ హనుమంత్ కొడింబా తదితరులు పాల్గొన్నారు. డీపీఆర్వో కార్యాలయంలో డీపీఆర్వో శ్రీనివాసరావు జాతీయ జెండా ఎగుర వేశారు.

☛ ఖమ్మం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ పూర్ణచంద్ర, ర.భ.శాఖ కార్యాలయంలో ఎస్ఈ లింగయ్య, ఎన్పీడీసీఎల్ ఖమ్మం డివిజన్ కార్యాలయంలో ఈఈ వెంకటేశ్వర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో ఈఈ మాణిక్యరావు, నీటిపారుదల శాఖ సర్కిల్ కార్యాలయంలో ఎస్ఈ మహేందర్‌రాజు,సీతారామా ప్రాజెక్టు సర్కిల్ కార్యాలయంలో ప్రాజెక్ట్సు సీఈ సుధాకర్ జాతీయ జెండా ఎగుర వేశారు. ఎస్ఈ నాగేశ్వరరావు, ఈఈ శ్రీనివాసాచార్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం సర్దార్‌పటేల్ స్టేడియంలో నిర్వహించారు. డీవైఎస్‌వో పరంధామరెడ్డి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. యువజన సంఘాల సమితి అధ్యక్షుడు జక్కుల వెంకటరమణ, పలువురు శిక్షకులు, స్టేడియం సిబ్బంది పాల్గొన్నారు. ఎన్‌సీసీ ఖమ్మం కార్యాలయంలో అధికారి సుబేదార్ మేజర్ టి.కె.మన్నా జాతీయ పతాకాన్ని ఎగురు వేశారు. జాతీయ గీతాలాపన తర్వాత జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. జిల్లా ఉపాధి కార్యాలయంలో అధికారి వి.విజేత, ఆబ్కారీ డీసీ కార్యాలయంలో డీసీ అంజన్‌రావు, ఈఎస్ కార్యాలయంలో ఈఎస్ సోమిరెడ్డి, సి.ఐ కార్యాలయంలో సి.ఐ.కె.రాజు, ఎన్‌వైకే కార్యాలయంలో సమన్వయకర్త రాజశేఖర్, స్కౌట్స్ గైడ్స్ కార్యాలయంలో కార్యదర్శి మీర్ ముజాహెదలి, గాంధీచౌక్‌లోని తపాలా కార్యాలయంలో ఆ శాఖ ఎస్పీ ఐసయ్య, వైకాపా జిల్లా కార్యాలయంలో ఆపార్టీ అధ్యక్షుడు లక్కినేని సుధీర్‌బాబు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు.

ఖమ్మం గాంధీచౌక్, న్యూస్‌టుడే: నగరంలోని పలు బ్యాంకుల వద్ద వేడుకలు జరిగాయి. గాంధీచౌక్‌లోని డీసీసీబీ వద్ద బ్యాంకు అధ్యక్షుడు మువ్వా విజయబాబు జాతీయ జెండా ఎగుర వేశారు. వైస్‌ఛైర్మన్ బాగం హేమంతరావు, సీఈఓ వి.నాగచెన్నారావు, జీఎం వసంతరావు పాల్గొన్నారు. స్టేషన్‌రోడ్డులోని స్తంభాద్రి బ్యాంకు ప్రధాన కార్యాలయం వద్ద బ్యాంకు ఛైర్మన్ ఎర్నేని రామారావు జాతీయ జెండా ఎగురవేశారు. బ్యాంకు వైస్‌ఛైర్మన్ జూపూడి హనుమత్‌ప్రసాద్, డైరెక్టర్లు పాల్గొన్నారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆంధ్రాబ్యాంకు, గ్రామీణ వికాస్ బ్యాంకు, విజయబ్యాంకు, కెనరా బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, సహకార బ్యాంకులు, ఇతర అన్ని బ్యాంకుల వద్ద జెండా వందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద అధ్యక్షుడు ఆర్జేసీ కృష్ణ జెండా ఎగురవేశారు. వ్యవసాయశాఖ, పశుసంవర్ధకశాఖ, ఉద్యాన పట్టుపరిశ్రమశాఖ, జిల్లా మార్కెటింగ్‌శాఖ, మత్స్యశాఖ, విజయడెయిరీ, తూనికలు కొలతలశాఖ, వర్తక సంఘం కార్యాలయాల్లో జెండా వందన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

విద్యావిభాగం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖా కార్యాలయంలో డీఈఓ విజయలక్ష్మిబాయి, పీజీ కళాశాలలో ప్రిన్సిపల్ రాధాకృష్ణ, ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్. వీరభద్రయ్య, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్. బి.మాధురి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖా కార్యాలయంలో డీఐఈఓ ఆండూస్రలు జాతీయ జెండా ఎగురవేశారు. నయాబజారు, శాంతినగర్, గాంధీచౌక్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలతో పాటు పలు ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో కూడా జాతీయ జెండా ఎగురవేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న ఉర్దూఘర్ షాదీఖానాలోని గ్రంథాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.



డీపీఆర్వో కార్యాలయంలో జాతీయ జెండా ఎగుర వేసి వందనం చేస్తున్న డీపీఆర్వో శ్రీనివాసరావు, ఏపీఆర్వోలు, సిబ్బంది



స్తంభాద్రి బ్యాంకు వద్ద జెండా ఎగురవేస్తున్న ఛైర్మన్ ఎర్నేని రామారావు

వాడ వాడలా వేడుకలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలువురు యువకులు వాహనాలకు జాతీయజెండాలను ఏర్పాటుచేసుకొని కేరింతలు కొడుతూ ప్రదర్శనలు నిర్వహించారు. ఖమ్మం నగరపాలకసంస్థ కార్యాలయంలో మేయర్ డాక్టర్ గుగులోత్ పాపాలాల్, తెరాస కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు బుడాన్‌బేగ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనసభ్యుడు పువ్వాడ అజయ్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో కార్యాలయ ఇన్‌ఛార్జి దయాకర్‌రెడ్డి జాతీయజెండాను ఆవిష్కరించారు. నగరంలోని డివిజన్‌లలో ఆయా డివిజన్ల కార్పొరేటర్‌లు వివిధ ప్రాంతాల్లో జాతీయజెండాలను ఆవిష్కరించారు. స్థానిక ఎన్‌ఎస్‌పీ పాఠశాలలో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కృపాబాలానందం జెండాను ఆవిష్కరించారు. విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. 36డివిజన్ కార్పొరేటర్ దీపక్‌చౌదరి మామిళ్లగూడెంలో, 48వ డివిజన్ కార్పొరేటర్ సారథినగర్ పాఠశాలలో, 45వ డివిజన్ కార్పొరేటర్ బురదరాఘవపురం అంబేడ్కర్ సెంటర్‌లో జాతీయజెండాలను ఆవిష్కరించారు. గాంధీచౌక్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే అజయ్‌కుమార్ పాల్గొన్నారు. గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జెండాను భుజంపై ఉంచుకొని ఆ ప్రాంతంలో స్థానిక నాయకులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు.

గట్టయ్య సెంటర్, న్యూస్‌టుడే: నగరంలోని ఆర్‌టీఏ కార్యాలయంలో జాతీయ జెండాను ఎంవీఐ ధన్‌రాజ్ బజాజ్ ఎగురవేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో ఉన్న ప్రతీ ఒక్కరు దేశ ఉన్నతికి పాటుపడాలని కోరారు. నగరంలోని ఎన్టీఆర్ సర్కిల్ మినీవ్యాన్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ సభ్యులు ఘనంగా నిర్వహించి దేశ భక్తిని చాటుకున్నారు. ఎంవీఐ ధన్‌రాజ్ బజాజ్ జాతీయ జెండాను ఎగురవేశారు. మినీ ట్రాన్స్‌పోర్టు యూనియన్ అధ్యక్షుడు ఎస్‌కె.యాసిన్ మాట్లాడుతూ దేశ ప్రజలు అందరూ సమానమేనన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు కుర్రా వెంకటేశ్వర్లు, కార్యదర్శి అన్నపు లక్ష్మణ్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్సై తుమ్మ గోపి జాతీయ జెండాను ఎగురవేశారు. పంచాయతీ కార్యాలయాలలో సర్పంచులు జెండాలను ఎగురవేశారు.



నగరపాలక సంస్థ కార్యాలయంలో జెండాను ఆవిష్కరిస్తున్న మేయర్ డాక్టర్ పాపాలాల్, పక్కనే కమిషనర్ బి.శ్రీనివాస్, కార్పొరేటర్‌లు, అధికారులు



తెరాస పార్టీ కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు బుడాన్‌బేగ్, ఇతర నాయకులు



33వ డివిజన్‌లో జెండా ఆవిష్కరణ చేస్తున్న తెరాస నాయకులు శీలంశెట్టి వీరభద్రం



ఆర్టీఏ కార్యాలయంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న ఎంవీఐ ధన్‌రాజ్ బజాజ్



ఉట్టి కొడుతున్న చిన్నారులు



వివిధ రూపాల్లో చిన్ని కృష్ణుని బొమ్మలు



యువతుల దాండియా నృత్యం..

కన్నులపండువగా
కృష్ణాష్టమి వేడుకలు
ఆకట్టుకున్న దాండియా నృత్యాలు



దాండియా నృత్యం..



శాస్త్రీయ నృత్యం చేస్తున్న యువతి

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: నగరంలోని శ్రీమురళీకృష్ణ మందిరం, ద్వారకనగర్ రాధాకృష్ణ ఆలయాల్లో మంగళవారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విశేష పూజలు, చిన్నారులకు శ్రీకృష్ణ వేషధారణ పోటీలు, చిన్నారులతో నృత్య ప్రదర్శన, యువతీయువకులతో దాండియా నృత్యం, ఉట్లు కొట్టడం వరకు నిర్వహించారు. వీటిని తిలకించేందుకు ఆలయంలో భక్తులు బారులు తీరారు. చిన్నికృష్ణుల అలంకరణలో ఉన్న చిన్నారులచే ఉట్లు కొట్టే సమయంలో, గోపికల అలంకరంలో చిన్నారులు చేసిన నృత్యాలు, యువతీయువకుల దాండియా నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భక్తులకు కోసం నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కృష్ణుడు చెరసాలలో జన్మించిన సన్నివేశాలు, కంసుడిని సంహరించిన సన్నివేశాలతో చేసిన అలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ముగిసిన జాతీయ చదరంగం పోటీలు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: జాతీయ చదరంగం పోటీలు మంగళవారం ఖమ్మం కవితా మెమోరియల్ డిగ్రీ కళాశాలలో ముగిశాయి. అయిదు రోజులు హోరాహోరీగా సాగిన పది రౌండ్ల పోటీల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు తలపడ్డారు. వీరిలో తెలంగాణ క్రీడాకారుడు ఎం. రవికుమార్ ఎనిమిదిన్నర పాయింట్లతో విజేతగా నిలిచాడు. విన్నర్ టైటిల్, ట్రోఫీతో పాటు రూ. 20వేల నగదును రవికుమార్‌కు నిర్వాహకులు అందజేశారు. ఎనిమిది పాయింట్లు పొందిన షేక్ హర్ష్, షేక్ గౌస్, అరగొండ మోహన్, ద్వితీయ స్థానంలో నిలిచారు. వారు సాధించుకున్న పాయింట్ల క్రమంలో ఒక్కొక్కరికి రూ. 15వేలు, పదివేలు, తొమ్మిది వేలు నగదు బహుమతులు అందజేశారు. వెంగల ప్రశాంత్, విశ్వనాథ్‌కన్నన్, డి. సుబ్రమణ్యం ఏడున్నర పాయింట్లు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. క్రీడాకారులు సాధించిన స్థానాలకు అనుగుణంగా రూ. 4 వేల నుంచి రూ. 20వేల వరకు నగదు పురస్కారాలను నిర్వాహకులు అందజేశారు. ముగింపు కార్యక్రమంలో కేఎండీసీ కళాశాల ప్రిన్సిపల్ రమణారావు, అఖిల భారత చదరంగ సమాఖ్య సభ్యుడు అనంచిన్ని వెంకటేశ్వరావు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా చదరంగ సంఘం సభ్యులు సైదులు, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

విశ్రాంత ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తాం: తుమ్మల

నెహ్రూనగర్(ఖానాపురం హవేలి), న్యూస్‌టుడే: రాష్ట్ర, దేశ ప్రజలకు ఎంతో సేవ చేసి ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంతి ఉద్యోగుల సంక్షేమానికి కేసీఆర్ ప్రభుత్వం ముందుంటుందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. మంగళవారం జిల్లాలో పంద్రాగస్టు వేడుకల్లో పాల్గొనేందుకు ఖమ్మం వచ్చిన ఆయన నెహ్రూనగర్‌లో నూతనంగా నిర్మించిన విశ్రాంత ఉద్యోగుల భవన్ 2వ అంతస్తును ప్రారంభించారు. నూతనంగా నిర్మించిన లిఫ్టును దాత సంఘం గౌరవ అధ్యక్షులు ఎర్నేని రామారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్యాణం కృష్ణయ్య అధ్యక్షత వహించిన సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ పెన్షనర్స్ పెండింగ్ సమస్యలను పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన ప్రకటించారు. తుమ్మలకు సంఘం తరుపున శాలువాలు, పుష్పగుచ్ఛాలు, సరస్వతిదేవి విగ్రహాన్ని బహూకరించారు. సమావేశంలో మేయర్ పాపాలాల్, కేవి రత్నం, సయ్యద్ పాషా, జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్. రవీందర్‌రావు, కోశాధికారి డి. కె. శర్మ, కుమారాచారి, శ్రీనివాసరావు, ఆర్. రామయ్య, జక్కుల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమైన తేదీలు

- ★ యూపీఎస్సీలోని వివిధ ఉద్యోగాలకు దరఖాస్తు చేయడానికి: *31* ఆగస్టు
- ★ ఇంటెలిజెన్స్ బ్యూరోలోని ఉద్యోగాలకు దరఖాస్తు చేయడానికి: *2* సెప్టెంబరు
- ★ నిట్ రూర్కెలాలోని ఉద్యోగాలకు చివరి తేదీ: *11* సెప్టెంబరు
- ★ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్‌లో నాన్‌టీచింగ్ పోస్టులకు: 18 సెప్టెంబరు

ప్రతిభ

ఉద్యోగాలు

3562 ప్రొబేషనరీ ఆఫీసర్లు

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలక్షన్ ప్రొబేషనరీ ఆఫీసర్లు/ మేనేజ్‌మెంట్ ట్రెయినీస్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

- ★ మొత్తం ఖాళీలు: 3562
- ★ అర్హత: ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- ★ వయసు: 1 ఆగస్టు 2017 నాటికి 20 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసున్నవారు అర్హులు. ఎస్సీ/ ఎస్టీ అభ్యర్థులకు అయిదు సంవత్సరాలు, ఓబీసీ (నాన్ క్రీమీ లేయర్) అభ్యర్థులకు మూడు సంవత్సరాలు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పది సంవత్సరాలు వయోపరిమితిలో మినహాయింపు లభిస్తుంది.
- ★ ఎంపిక: ఆన్‌లైన్ రాతపరీక్ష (ప్రిలిమ్స్, మెయిన్), ఇంటర్వ్యూ ఆధారంగా.
- ★ **పరీక్ష విధానం:**
- ★ **ప్రిలిమినరీ ఎగ్జామినేషన్:** ఇంగ్లిష్ లాంగ్వేజ్ (30 ప్రశ్నలు, 30 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (35 ప్రశ్నలు, 35 మార్కులు), రీజనింగ్ ఎబిలిటీ (35 ప్రశ్నలు, 35 మార్కులు) నుంచి మొత్తం 100 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు: 100. కాల వ్యవధి: 1 గంట.
- ★ **మెయిన్ ఎగ్జామినేషన్:** రీజనింగ్ అండ్ కంప్యూటర్ ఆప్టిట్యూడ్ (45 ప్రశ్నలు, 60 మార్కులు, 60 నిమిషాలు), జనరల్/ ఎకానమీ/ బ్యాంకింగ్ అవేర్‌నెస్ (40 ప్రశ్నలు, 40 మార్కులు, 35 నిమిషాలు), ఇంగ్లిష్ లాంగ్వేజ్ (35 ప్రశ్నలు, 40 మార్కులు, 40 నిమిషాలు), డేటా అనాలిసిస్ అండ్ ఇంటర్‌ప్రిటేషన్ (35 ప్రశ్నలు, 60 మార్కులు, 45 నిమిషాలు) నుంచి మొత్తం 155 ప్రశ్నలు ఇస్తారు. మొత్తం మార్కులు 200. కాల వ్యవధి: 3 గంటలు. ఇవి కాక ఇంగ్లిష్ లాంగ్వేజ్ (లెటర్ రైటింగ్ అండ్ ఎస్సే) నుంచి 25 మార్కులకు రెండు ప్రశ్నలు ఇస్తారు. దీనికి 30 నిమిషాల వ్యవధి ఉంటుంది.
- ★ ప్రిలిమ్స్, మెయిన్స్ రెండింటిలో నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది.
- ★ దరఖాస్తు రుసుము: ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ అభ్యర్థులు రూ.100, ఇతరులు రూ.600 దరఖాస్తు రుసుమును ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా చెల్లించాల్సి ఉంటుంది.
- ★ ప్రిలిమినరీ పరీక్ష తేదీలు: అక్టోబరు 7, 8, 14, 15
- ★ మెయిన్ ఎగ్జామినేషన్: 26 నవంబరు
- ★ తెలుగు రాష్ట్రాలకు పరీక్ష కేంద్రాలు (ప్రిలిమ్స్): చీరాల, చిత్తూరు, గుంటూరు, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, పుత్తూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్.
- ★ మెయిన్స్: గుంటూరు, కర్నూలు, విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్.

★ చివరి తేదీ: **5 సెప్టెంబరు**

వెబ్‌సైట్: **www.ibps.in**

నిట్, రూర్కెలాలో 203 ఖాళీలు

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, రూర్కెలా ఇంజినీరింగ్, ఆర్కిటెక్చర్, సైన్స్, హ్యూమానిటీస్, మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ✻ మొత్తం ఖాళీలు: 203 (అన్‌రిజర్వ్‌డ్ - 55, ఎస్సీ - 40, ఎస్టీ - 26, ఓబీసీ - 82)
- ✻ అసిస్టెంట్ ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్
- ✻ ఖాళీ ఉన్న విభాగాలు/ స్పెషలైజేషన్స్/ అకడెమిక్ గ్రూప్‌లు: బయోటెక్నాలజీ అండ్ మెడికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్, కెమికల్ ఇంజినీరింగ్, సెరామిక్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్, కెమిస్ట్రీ, ఎర్త్ అండ్ అట్మాస్ఫియరిక్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్, ఫుడ్ ప్రాసెస్ ఇంజినీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, ఇండస్ట్రియల్ డిజైన్, లైఫ్ సైన్స్, మ్యాథమెటిక్స్, మెకానికల్ ఇంజినీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజినీరింగ్, మైనింగ్ ఇంజినీరింగ్, ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, ఫిజిక్స్ అండ్ ఆస్ట్రానమీ, స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్.

అర్హతలు: ఇంజినీరింగ్ విభాగంలో పోస్టులకు ప్రథమ శ్రేణి మార్కులతో సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.

- ★ ఇండస్ట్రియల్ డిజైన్‌కి 60 శాతం మార్కులతో బీటెక్/ బీడీఈఎస్‌తోపాటు సంబంధిత విభాగంలో పీహెచ్‌డీ అవసరం.
- ★ ఆర్కిటెక్చర్ విభాగానికి ప్రథమ శ్రేణిలో బీఆర్క్, ఎంఆర్క్/ పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
- ★ సైన్స్/ హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్ విభాగాలకు సంబంధిత విభాగంలో ప్రథమ శ్రేణి మార్కులతో మాస్టర్స్ డిగ్రీ, పీహెచ్‌డీ ఉత్తీర్ణులై ఉండాలి.
- ★ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ పోస్టులకు మేనేజ్‌మెంట్‌లో ప్రథమ శ్రేణి మార్కులతో ఎంబీఏ/ పీడీడీబీఎంతోపాటు పీహెచ్‌డీ అవసరం.

- ★ ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
- ★ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.

చివరి తేదీ: ***11 సెప్టెంబరు***

వెబ్‌సైట్: **nitrkl.ac.in**

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- ★ మొత్తం ఖాళీలు: 15.
- ★ డాక్యుమెంటేషన్ కమ్ టెక్నికల్ అసిస్టెంట్/ లైబ్రేరియన్ - 1.
- ★ సీనియర్ అసిస్టెంట్ - 2 (ఏదైనా డిగ్రీతోపాటు సంబంధిత విభాగంలో అనుభవం అవసరం).
- ★ జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ - 1.
- ★ స్టెనోగ్రాఫర్ - 4 (ఏదైనా డిగ్రీతోపాటు లోయర్ స్టెనోగ్రఫీ, టైప్ రైటింగ్‌లో సర్టిఫికెట్, కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం).
- ★ ల్యాబొరేటరీ అటెండెంట్ - 1.
- ★ ప్రొఫెషనల్ అసిస్టెంట్ - 2. (లైబ్రరీ సైన్స్/ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్‌లో 55 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన అర్హతతోపాటు అనుభవం ఉండాలి. కంప్యూటర్ అప్లికేషన్‌లో డిప్లొమా ఉన్నవారికి ప్రాధాన్యం లభిస్తుంది.
- ★ జూనియర్ ప్రొఫెషనల్ అసిస్టెంట్ - 1.
- ★ లైబ్రరీ అటెండెంట్ - 2 (ఎస్ఎస్‌సీ లేదా తత్సమాన అర్హతతోపాటు సంబంధిత విభాగంలో సర్టిఫికెట్ అవసరం).
- ★ మెస్ సూపర్‌వైజర్ - 1.
- ★ దరఖాస్తు: 18 ఆగస్టు నుంచి 18 సెప్టెంబరు వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.

★ పూర్తి చేసిన దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ:

29 సెప్టెంబరు

★ వెబ్‌సైట్: **uohyd.ac.in**

ఇంటెలిజెన్స్ బ్యూరోలో 1300 ఖాళీలు



కేంద్ర హోం మంత్రిత్వ శాఖ పరిధిలోని ఇంటెలిజెన్స్ బ్యూరో అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్ గ్రేడ్-2/ ఎగ్జిక్యూటివ్ ఎగ్జామ్ 2017 కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది.

- ★ **పోస్టు పేరు:** అసిస్టెంట్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ ఆఫీసర్/ ఎగ్జిక్యూటివ్
- ★ **ఖాళీలు:** 1300 (అన్ రిజర్వ్‌డ్ - 951, ఓబీసీ - 184, ఎస్సీ - 109, ఎస్టీ - 56).
- ★ **అర్హత:** ఏదైనా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ పరిజ్ఞానం ఉంటే మంచిది.
- ★ **వయసు:** 18 నుంచి 27 సంవత్సరాల మధ్య వయసున్నవారు అర్హులు. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు వయోపరిమితిలో మినహాయింపు లభిస్తుంది.
- ★ **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
- ★ **పరీక్ష విధానం:** టైర్ - 1, టైర్ - 2 అనే రెండు రాత పరీక్షలు నిర్వహిస్తారు.
- ★ **టైర్ – 1:** ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, లాజికల్/ ఎనలిటికల్ ఎబిలిటీ, ఇంగ్లిష్ లాంగ్వేజ్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. 100 మార్కులు. వ్యవధి: 60 నిమిషాలు. నెగెటివ్ మార్కింగ్ ఉంటుంది. టైర్ - 1లో అర్హత సాధించిన అభ్యర్థులకు టైర్ - 2 పరీక్ష నిర్వహిస్తారు.
- ★ **టైర్ – 2:** డిస్క్రిప్టివ్ తరహాలో ఉంటుంది. ఎంపిక చేసిన అంశంపై ఎస్సే రాయాల్సి ఉంటుంది (దీనికి కేటాయించిన మార్కులు 30). మరో ప్రశ్నగా 20 మార్కులకు ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్ అండ్ ప్రిసైజ్ రైటింగ్ ఉంటుంది. మొత్తం వ్యవధి - 60 నిమిషాలు.
- ★ టైర్ - 2లో అర్హత సాధించిన అభ్యర్థులకు 100 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
- ★ తెలుగు రాష్ట్రాలకు పరీక్ష కేంద్రాలు: విజయవాడ, హైదరాబాద్.
- ★ దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.

★ చివరి తేదీ: ***2 సెప్టెంబరు***

★ వెబ్‌సైట్: **www.mha.nic.in**

యూపీఎస్సీ

